విశాఖపట్టణం
శుక్రవారం 16 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయజయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 245 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# బాబు కేసులపై పిటీషన్ వాయిదా

### పిల్ పై విచారణ చేసిన హైకోర్టు



**(అమరావతి - జయజయహే)**

సీఎం చంద్రబాబుపై గతంలో నమోదైన వివిధ కేసుల దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు బదిలీ చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో విచారణ జరిగింది. జర్నలిస్ట్ బాలగంగాధర తిలక్ ..మిగతా 2లో



## న్యాయవ్యవస్థను ఎవరు

# బెదిరించలేరు

### మేమేమీ మూసి ఉన్న గదుల్లో లేం

### లోపల ఏం మాట్లాడుతున్నరో..

### ఇక్కడ ఏం చెబుతున్నారో తెలుసు

### రాహుల్ చేపట్టిన మార్చ్ పై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

న్యాయ వ్యవస్థను ఎవరూ బెదిరించలేరు. మేమేమీ మూసి ఉన్న గదుల్లోనో, రాతి మేడల్లోనో కూర్చోవడం లేదు. కోర్టు వెలుపల నేతలు ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారో, ఇక్కడ ఏం మాట్లాడుతున్నారో అన్నీ గమనిస్తున్నాం" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తీరుకు నిరసనగా అక్టోబర్ 12న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు చేపట్టిన 'మార్చ్'పై దాఖలైన పిటిషన్లను విచారిస్తూ ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సీజేఐ జస్టిస్ ..మిగతా 2లో

# సరస్‌లో ముర్ము చీర కొనుగోలు

### డిజిటల్ పేమెంట్ చేసిన రాష్ట్రపతి

### మహిళల నైపుణ్యం చూసి అబ్బురం

### చేతివృత్తి కళాకారులతో ముచ్చట్లు

### ప్రదర్శనకు హాజరైన గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు





**(విజయవాడ - జయజయహే)**

దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ సరస్ మేళా--2026 వేడుకలు విజయవాడ నగరం వేదికగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పున్నమి ఘాట్ ప్రాంగణంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. గురువారం ఉదయం ఈ జాతీయ మేళాను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 15 నుండి అక్టోబర్ 31 వరకు దాదాపు 14 రోజుల పాటు ఈ మేళా ప్రజలకు అందుబాటులో ఉండనుంది. మేళా ప్రారంభం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. గ్రామీణ చేతివృత్తులు, చేనేత వస్త్రాలు, హ్యాండీక్రాఫ్ట్స్, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు, ఇతర కళారూపాలను ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ విధానంపై డ్వాక్రా మహిళలతో ముచ్చటించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా ఒక స్టాల్‌లో చీరను కొనుగోలు చేసిన రాష్ట్రపతి, స్వయంగా డిజిటల్ విధానంలో చెల్లింపు చేశారు. మహిళల ప్రతిభ, నైపుణ్యాలు, వారి వ్యాపార దృక్పథాన్ని రాష్ట్రపతి అభినందించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి ఆమె భోజనం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ..మిగతా 2లో

# జోక్యం చేసుకోలేం..!

### విశాఖ ఎయిర్ పోర్టు క్లోజ్‌పై హైకోర్టు వ్యాఖ్యలు

### పిటీషన్‌ను తోసిపుచ్చిన చీఫ్ జస్టిస్ లిసా గిల్ ధర్మాసనం




**(అమరావతి - -జయజయహే)**

విశాఖ ఎయిర్‌పోర్ట్ సర్వీసుల నిలిపివేతపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య, సివిల్ విమాన కార్యకలాపాలను నిలిపివేస్తూ, వాటిని కొత్తగా వస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ చేస్తూ కేంద్ర సివిల్ ఏవియేషన్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై జోక్యం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. ఈ బదిలీని సవాలు చేస్తూ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావుతో పాటు మరికొందరు దాఖలు చేసిన పిల్ (పిల్) ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ..మిగతా 2లో

# అక్కడ ఎన్నికల్లేవ్..!

### 4 కార్పేషన్లు, 15 మున్సిపాల్టీల్లో బ్రేక్

### నాలుగు నగర పంచాయతీల్లోను నిలుపుదల

### కోర్టు కేసులే కారణం




**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో 123 అర్బన్ లోకల్ బాడీస్ ఉండగా ప్రస్తుతం 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు మాత్రమే ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ అయింది. సుప్రీంకోర్టులో కేసుల కారణంగా 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు ప్రస్తుతం ..మిగతా 2లో



## ఎన్నికల వ్యవస్థపై

# నమ్మకం పోయింది

### సీజేపీ నేతలు సౌరవ్, అశుతోశ్ అరెస్టులకు ఖండన

### కాక్రోచ్ పార్టీ పోరాటానికి సంపూర్ణ మద్దతు

### వైఎస్సార్ సీపీ అధినేత జగన్ ట్వీట్

**(తాడేపల్లి - జయజయహే)**

కాక్రోచ్ జనతా పార్టీ నేతల అరెస్టుల వ్యవహారంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ తీరు తెన్నులపై ఘాటు విమర్శలు గుప్పించిన ఆయన, సిజేపీ నేతలకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంతా జరిగిపోయిన తర్వాత అధికారులతో విచారణలు జరిపించడం, కంటితుడుపు చర్యలకు దిగడం కంటే, నష్టం జరగక ముందే వ్యవస్థలు జాగ్రత్త పడటం ఎంతో మంచిదని జగన్ హితవు ..మిగతా 2లో

## జగన్ కేసుల్లో

# విచారణ ప్రారంభం

### అరబిందో, హెటిరో డిశ్చార్జీ పిటీషన్‌లపై విచారణ



**(హైదరాబాద్ - జయజయహే)**

వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ పిటిషన్లపై సీబీఐ కోర్టు రోజువారీ విచారణ ప్రారంభించింది. అరబిందో, హెటిరో సంస్థల కేసులో జగన్ దాఖలు చేసిన డిశ్చార్జీ పిటిషన్‌పై సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావు విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు వర్తించదని, క్రిమినల్ కేసు తేలకుండా ఈడీ కేసు నమోదు ..మిగతా 2లో

# స్థానిక ఎన్నికలను నిలిపివేయాలి

### హైకోర్టులో పిల్ దాఖలు

### తీర్పుని రిజర్వే చేసిన న్యాయస్థానం

2

# అబ్జర్వర్లుగా 28 మంది ఐఏఎస్‌లు

### ఎన్నికల సాధారణ పరిశీలకులుగా నియామకం

### సార్వత్రిక ఎన్నిక విధానాలో స్థానికంలోనూ అమలు

### ఎస్ ఈసీ అనిల్ చంద్ర పునేఠా వెల్లడి



**(అమరావతి - జయజయహే)**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 28 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. గురువారం ఎస్ఈసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని వారికి స్పష్టం చేశారు. ఈ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ..మిగతా 2లో

# సరస్‌లో ముర్ము చీర కొనుగోలు

మొదటి పేజీ తరువాయి...

కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. నాణ్యమైన ప్యాకింగ్, ఆన్‌లైన్ ఇ-కామర్స్ అనుసంధానం, విశాఖపట్నం, విజయవాడలలో ప్రాసెసింగ్ సెంటర్ల ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చడమే దీని ముఖ్య ఉద్దేశం. ఏటికొప్పాక బొమ్మలు, అరకు కాఫీ, మాడుగుల హల్వా, చేనేత చీరలు, ప్రకృతి సిద్ధమైన మసాలాలు, మిల్లెట్స్, సబ్బులు వంటి పలు జిల్లాల ప్రసిద్ధ ఉత్పత్తులను ఈ మేళాలో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. మహిళల అభ్యున్నతిపై దృష్టి కేంద్రీకరించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఉపాధి కల్పనను దాటి, లాభదాయకమైన, స్థిరమైన, విస్తరించదగిన మహిళా పారిశ్రామిక సంస్థలను నిర్మించడం మీద దృష్టి పెట్టాలని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలకు తగిన ఆర్థిక వసతులు, ఆధునిక సాంకేతికత, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. నమ్మకమైన మార్కెట్ అనుసంధానాలు కల్పించడం ద్వారా వారి వ్యాపారాలను విస్తరించుకోవడానికి విస్తృత మార్కెట్లలో పోటీ పడేలా మద్దతునివ్వాలని గవర్నర్ తెలిపారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... విజయవాడలో కనకదుర్గమ్మ ఆశీస్సులతో, కృష్ణమ్మ చెంతన ఈ జాతీయ సరస్ మేళాను ప్రారంభించేందుకు విచ్చేసిన




రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'సాధారణ పేద కుటుంబంలో జన్మించి, ఉపాధ్యాయురాలిగా జీవితాన్ని ప్రారంభించి అనేక కష్టాలను ఎదుర్కొంటూ నేడు దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అధిష్టించిన ద్రౌపది ముర్ము జీవితం సమాజానికి గొప్ప ఆదర్శం. మహిళ తలుచుకుంటే ఏ ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలదని ఆమె నిరూపించారు.' చంద్రబాబు నాయుడు అన్నారు.

## న్యాయవ్యవస్థను ఎవరు బెదిరించలేరు

మొదటి పేజీ తరువాయి...

సూర్య కాంత్, జస్టిస్ జైమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంలో చర్యలు కోరుతూ దాఖలైన రెండు పిటిషన్లపై నోటీసులు జారీ చేసింది.



**కోర్టుల వద్ద నిరసనలపై దాఖలైన పిటిషన్లు**

కోర్టు ప్రాంగణాల వద్ద రాజకీయ నిరసనలు, ప్రదర్శనలను నియంత్రించాలని, కోర్టు వైపు ర్యాలీగా వచ్చిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మోయిత్రాలపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని పిటిషన్లలో కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలపై వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతించాలని ఖర్గే, రాహుల్ గాంధీ కోరినప్పటికీ, ఆ అంశాలు ఇప్పటికే న్యాయస్థానంలో పరిశీలనలో ఉన్నందున సీజేఐ ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. దాంతో అక్టోబర్ 12న 'ఇండియా' కూటమి నేతలు, కార్యకర్తలు సుప్రీంకోర్టు వైపు ప్రదర్శనగా బయలుదేరారు.

**'ఎవరూ మమ్మల్ని భయపెట్టలేరు'**

విచారణ సమయంలో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఇటువంటి రాజకీయ ప్రదర్శనల ఒత్తిడిని ఎదుర్కొనాల్సి రావడం ఎంతమాత్రం సరికాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై న్యాయవాదుల్లో తీవ్ర అసంతృప్తి ఉందంటూ, సుమారు 200 మంది లాయర్లు సంతకం చేసిన వినతిపత్రాన్ని కోర్టుకు సమర్పించారు. ఇటువంటి చర్యలు న్యాయ వ్యవస్థను భయపెట్టే యత్నమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వాదనలపై సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ స్పందించారు. "న్యాయ వ్యవస్థను ఎవరూ బెదిరించలేరు. ఇలాంటి బెదిరింపు ప్రయత్నాలు చాలా స్వల్పమైనవి. వాటిని ఎవరూ పట్టించుకోరు. కోర్టు వెలుపల ఏం జరుగుతుందో మాకు స్పష్టమైన అవగాహన ఉంది" అని వ్యాఖ్యానించారు.

**సీసీటీవీ దృశ్యాలు భద్రపరచాలని ఆదేశం**

ప్రదర్శన సందర్భంగా గర్భంతో ఉన్న పాత్రికేయురాలిని తోసివేశారని, ఆనాటి దృశ్యాలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని గౌరవ్ భాటియా కోరారు. స్పందించిన ధర్మాసనం, అక్టోబర్ 12న జరిగిన ఘటనలకు సంబంధించి సేకరించిన సీసీటీవీ దృశ్యాలు లేదా డిజిటల్ ఆధారాలన్నింటినీ భద్రపరచాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. మరోవైపు ప్రదర్శన సందర్భంగా నిషేధాజ్ఞలు ఉల్లంఘించారనే ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు భారతీ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నాలుగు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తిలక్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో రెండు, మందిర్ మార్గ్, బారాఖంబా రోడ్ పోలీసు స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

## ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోయింది

మొదటి పేజీ తరువాయి...

పలికారు. ప్రక్షాళన చేయాల్సింది రాజకీయ నేతలను కాదని, లోపభూయిష్టంగా మారిన ఎన్నికల వ్యవస్థనే అని ఆయన ఎక్స్ వేదికగా తేల్చిచెప్పారు. సీజేపీ కీలక నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేవలం అరెస్టులు, అణచివేత చర్యలతో ఏమీ సాధించలేరని, ఇటువంటి చర్యల వల్ల పరిస్థితి సర్దుమణగకపోగా మరింత దిగజారుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న మిగిలిన కాస్త నమ్మకం కూడా పూర్తిగా ఆవిరైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన అశుతోష్, సౌరవ్ దాస్‌లకు తన సానుభూతిని తెలియజేస్తూ ఆయన ప్రత్యేకంగా ట్వీట్ చేశారు.

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్లనే ఈ తరహా నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయని జగన్ తన ట్వీట్‌లో విశ్లేషించారు. ప్రస్తుతం మన వ్యవస్థలోనే పెద్ద లోపం ఉంది. ఎన్నికల వ్యవస్థపై పౌరుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉంది. అంతేగానీ ప్రశ్నించే గొంతులను జైలుపాలు చేయడం పరిష్కారం కాదు అని జగన్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం , ప్రభుత్వ యంత్రాంగాలు పక్షపాత వైఖరిని వీడి, ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సిజేపీ నేతలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ చేసిన ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియా వేదికల్లో వైరల్‌గా మారింది. జగన్ మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ సిజేపీ సీనియర్ నేతలు అభిజిత్ దీప్కే, అజింక్య షిండేలు ఆయన ట్వీట్‌ను రీట్వీట్ చేశారు. క్లిష్ట సమయంలో తమ పోరాటానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలవడం భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు కొత్త ఊపిరి పోసిందని వారు పేర్కొన్నారు.

## బాబు కేసులపై పిటీషన్ వాయిదా

మొదటి పేజీ తరువాయి...

ఈ పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సిట్ తరపున న్యాయవాది అఖిల్ హైకోర్టులో వాదనలు వినిపించారు. చంద్రబాబుపై గతంలో నమోదైన కేసులను లోతుగా పరిశీలించగా ఎటువంటి బలమైన ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఈ కేసులను చట్టప్రకారం మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, ఏసీబీ కోర్టు ఈ కేసుల మూసివేత ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇప్పటికే కొందరు హైకోర్టులో వేర్వేరుగా రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన అంశాలపై ఇప్పటికే విచారణ వేరే రూపంలో కొనసాగుతున్నందున, పిల్ కొత్తగా విచారించాల్సిందేమీ లేదని తెలిపారు. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. ఇరువర్గాల వాదనలను విన్న హైకోర్టు.. పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో తదుపరి విచారణ సమయంలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## జోక్యం చేసుకోలేం..!

మొదటి పేజీ తరువాయి...

చల్లా గుణరంజన్ లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురం - విశాఖల మధ్య ఆరు వరుసల జాతీయ రహదారి పూర్తయ్యే వరకైనా విశాఖ నుంచి డొమెస్టిక్ విమానాలను నడిపేలా ఆదేశించాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది. భోగాపురం నుంచి విశాఖపట్నానికి ఆరు వరసల జాతీయ రహదారిని(ఎన్‌హెచ్) పూర్తి చేసే వరకైనా డొమెస్టిక్ విమాన సర్వీసులను విశాఖపట్నం నుంచి నడిపేలా ఆదేశించాలని పిటిషనర్లు చేసిన అభ్యర్థనను సైతం ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురంలో విమాన రాకపోకల వేళలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని కోర్టు గమనించింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్, న్యాయమూర్తి చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని మౌఖికంగా పేర్కొంది.

**రహదారి పూర్తయ్యే వరకు సేవల కొనసాగింపు**

విశాఖపట్నంలో కార్యకలాపాలను నిలిపేసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం నామమాత్రంగా ఉందన్నారు. వారి తరఫున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ, విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది."విశాఖపట్నం నుంచి దేశీయ విమాన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, కనీసం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఈ సేవలను కొనసాగించాలని" వారు కోరారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 2017లో చేసుకున్న ఒప్పందం ప్రకారం భోగాపురం విమానాశ్రయం నుంచి సర్వీసు అందుబాటులోకి వచ్చిన రోజే విశాఖలో విమాన సర్వీసులను నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. విమానాల రాకపోకలకు అనుగుణంగా. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా రోజుకు 80 ట్రిప్పులు ఆర్టీసీ సర్వీసును నడుపుతున్నామన్నారు. ప్రతి అరగంటకు ఓ బస్సుందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని పిల్‌ను కొట్టేయాలని కోరారు.

## జగన్ కేసుల్లో విచారణ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

చేయడం చెల్లదని ఆయన వాదించారు. జగన్ అక్రమాస్తులకు సంబంధించి 2006 నుంచి 2021 వరకు ఈడీ తొమ్మిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్ల అన్నింటిలోనూ జగన్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. జగన్ కేసుల్లో అటు సీబీఐ దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లపై మాత్రమే ఇప్పటి వరకు రోజువారీ విచారణ చేపడుతోంది. ఈ విచారణ పూర్తయిన తర్వాతే ఈడీ కేసుల విచారణ ప్రారంభమవుతుందన్న ఉద్దేశంతో ఈడీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. సీబీఐ కోర్టులో తాము నమోదు చేసిన 9 కేసుల విచారణలో కదలిక లేదని ఆ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇకపై ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు అంగీకరించింది. సీబీఐ, ఈడీ కేసులపై కోర్టుకు లభించే సమయాన్ని బట్టి రెండింటిపై విచారణ చేపడుతున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా హెటిరో, అరబిందోలకు తెలంగాణలోని జడ్చర్లలో చెరో 75 ఎకరాల భూకేటాయింపులకు ప్రతిఫలంగా అరబిందో, ట్రైడెంట్ రూ.10 కోట్లు, హెటిరో రూ.19 కోట్ల 50 లక్షలు ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయని ఈడీ కేసు నమోదు చేసింది. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినందుకు ప్రతిఫలంగా లబ్ధిదారులు జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్ తదితర కంపెనీల్లో షేర్ వాస్తవ ధర కంటే అధిక ప్రీమియంతో పెట్టుబడులు పెట్టారని ఈడీ వాదిస్తోంది. సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా పీఎంఎల్ఏ కేసు నమోదు చేసిన ఈడీ ఈ ఒక్క కేసులోనే రూ.51 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. హెటిరో డ్రగ్స్‌కు చెందిన 35 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, అరబిందో ఫార్మాకు చెందిన 96 ఎకరాల భూమి, రూ.3 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జననీ ఇన్‌ఫ్రాకు చెందిన 13 ఎకరాలకు పైగా భూమి, జగతి పబ్లికేషన్స్‌కు చెందిన రూ.14.5 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఈడీ జప్తులో ఉన్నాయి.

## స్థానిక ఎన్నికలను నిలిపివేయాలి

**హైకోర్టులో పిల్ దాఖలు**

**తీర్పుని రిజర్వ్ చేసిన న్యాయస్థానం**

**(అమరావతి - జయజయహే)**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్ పై విచారణ పూర్తి చేసిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం విడుదల చేసిన జీఓలు గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్లను సరిగ్గా అమలు చేసేవరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ విన్నవించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల కోసం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్‌పై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత మాత్రమే దాని సిఫార్సులను అమలు చేయాల్సి ఉందని పిటిషనర్ వాదించారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాల్సి ఉన్నప్పటికీ, అధికారులు అలా చేయకుండా అభ్యంతరాలను స్వీకరించలేదని కోర్టుకు తెలిపారు. నిబంధనలను పాటించకుండా రిజర్వేషన్లు అమలు చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని కోర్టుకు విన్నవించారు. కేవలం ఫ్యామిలీ సర్వే ఆధారంగా మాత్రమే కాకుండా, ఇతర అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించి, చట్టప్రకారమే రిజర్వేషన్లను ఖరారు చేశామని స్పష్టం చేశారు. ఇరువర్గాల సుదీర్ఘ వాదనలను విన్న ఉన్నత న్యాయస్థానం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

## అక్కడ ఎన్నికల్లేవ్..!

మొదటి పేజీ తరువాయి...

నోటిఫికేషన్ రిలీజ్ కాలేదు. సుప్రీంకోర్టు కేసులు క్లియర్ కాగానే ఆ 23 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు ఏపీ ఎలక్షన్ ప్రధాన కమిషనర్. సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. విలీన ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ.. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అన్ని పిటిషన్లపై నవంబర్ 17న సుప్రీంకోర్టులో తుది విచారణ జరగబోతోంది. న్యాయపరమైన వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించలేని పట్టణ స్థానిక సంస్థల జాబితాలో మొత్తం 23 ప్రాంతాలున్నాయి. వీటిలో రాజమండ్రి, కాకినాడ, మంగళగిరి, శ్రీకాకుళం లాంటి కీలక కార్పొరేషన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, ఏలూరు జిల్లాలోని ఒక మున్సిపాలిటీలో ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంతో పాటు.. ఏలూరు జిల్లా చింతలపూడి మున్సిపాలిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడలేదు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. తణుకులో వార్డుల డీలిమిటేషన్ కారణంగా ఎన్నికలు ఆగాయి.

రాజమండ్రి కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. విలీన గ్రామాల ప్రజలు రాజమండ్రి కార్పొరేషన్ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పిటిషన్ హైకోర్టులో.. విచారణ దశలో ఉన్న కారణంతో ఎన్నికలు తాత్కాలికంగా నిలిపివేశారు. కుశాలపురం పంచాయతీ విలీనంపై గ్రామస్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఆగాయి. 2005 తర్వాత శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఎన్నికలు జరగలేదు. 12ఏళ్లుగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదు. ఈసారి కూడా వారికి నిరాశే ఎదురైంది. విలీన గ్రామాలు కేసు, వార్డుల విభజన పెండింగ్ ఉండటంతో.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వలేదు.

విజయనగరం జిల్లా రాజాం నగర పంచాయతీలో కోర్టు కేసుల కారణంగా 21ఏళ్లు ఎన్నికలు జరగలేదు. ఇటీవలే విలీన గ్రామాల పిటిషనర్లు కేసు విత్ డ్రా చేసుకోవడంతో ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. వార్డుల విభజన పూర్తికాకపోవడంతో.. రాజాంలోనూ ఎన్నికల జరపడం లేదు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మున్సిపాలిటీకి చివరగా 2014లో ఎన్నికలు జరిగాయి. వార్డుల విభజన సరిగా లేదని టీడీపీ నేత కోర్టును ఆశ్రయించడంతో.. గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయినప్పటికీ కోర్టు వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో ఎన్నికలు ఆగాయి. పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, గుంటూరు జిల్లాలోని పొన్నూరు, బాపట్ల జిల్లాలోని బాపట్ల మున్సిపాలిటీతో పాటు మంగళగిరి కార్పొరేషన్ ఎన్నికలకు బ్రేక్ పడింది. వార్డుల పునర్విభజన, ఓటర్ జాబితా, రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో ఎన్నికలు ఆపారు. కావలి మున్సిపాలిటీ పరిధిలో తమను కలపొద్దు అంటూ కావలి రూరల్ మండలం చౌదరిపాలానికి చెందిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో గతంలో ఇక్కడ ఎన్నికలు జరగలేదు. అల్లూరు నగర పంచాయతీ, గూడూరు మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో రెండుచోట్ల ఎన్నికలు జరగడం లేదు. మార్కాపురం జిల్లా పొదిలి నగర పంచాయతీలోనూ సేమ్ సీన్. విలీన గ్రామాల ప్రజలు కోర్టు మెట్లెక్కడంతో ఎన్నిక ఆగింది. ప్రకాశం జిల్లా కందుకూరు మున్సిపాలిటీలో వార్డుల విభజన ఆలస్యం కావడంతో తొలిదశలో ఎన్నికలు జరపడం లేదు. బి. కొత్తకోట మున్సిపాలిటీపై కోర్ట్ కేసు వెనక్కి తీసుకున్నా.. తుది తీర్పురాకపోవడంతో ఎన్నిక ఆగింది. అన్ని కేసులపై నవంబర్ 17న సుప్రీంకోర్టు విచారణ జరుపుతుండటంతో.. కోర్ట్ కేసు క్లియర్ అయ్యి ఎన్నికలు నిర్వహిస్తారా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## అబ్జర్వర్లుగా 28 మంది ఐఏఎస్‌లు

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అనుసరించే విధానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ ప్రతినిధులు ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని పరిశీలకులకు వివరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మరో వైపు రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తులతో బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థులకు చోటు కేటాయింపు విధివిధానాలను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయితీలలో మేయర్లు, చైర్మన్‌లు, వార్డు సభ్యుల ఎన్నిక కోసం బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఈ విధివిధానాలు పాటిస్తారని ఎస్ఈసీ వెల్లడించింది. బ్యాలెట్ పత్రంలో మొత్తం ఐదు టేబుళ్ల కింద వరుస క్రమంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల పార్టీ, గుర్తులు ప్రచురిస్తామని పేర్కొంది.

# ఇవేం చేరికలు..?

## మిత్రపక్షంలోకి సొంత పార్టీ అభ్యర్థులు!

(జయజయహే-ప్రత్యేక ప్రతినిధి)

ఒకప్పుడు సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామని ప్రకటించేవారు.. పార్టీ మూల సిద్ధాంతాలను కాలరాస్తోందని రాజీనామా చేసి వెళ్లిపోయేవారు. అంతా సిద్ధాంతం చుట్టే తిరుగుతుండేది ఆనాటి రాజకీయం ఇప్పుడు ఆ సిద్ధాంతమే పూర్తిగా మారిపోయింది. పార్టీ కంటే గెలుపే ముఖ్యం అనే వేదాంతాన్ని ఒంటపట్టించుకుని బరిలోకి దిగుతున్నారు. పొత్తుల ప్రసక్తి ఎలా వున్నా సీటు ఒక పార్టీకి కేటాయిస్తే అభ్యర్థి మరో పార్టీ నుంచి వస్తున్నాడు. ఎన్నికల పొత్తుల్లో భాగంగా ఒక నియోజకవర్గాన్ని మిత్రపక్షానికి కేటాయిస్తే ఆ పార్టీకి అక్కడ గెలవగల బలమైన అభ్యర్థి లేకపోతే తమ మిత్రపక్షంలో అప్పటికే ఉన్న బలమైన నాయకుడికి కండువా కప్పి టికెట్ ఇచ్చేస్తున్నారు. ఇదే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయవాడలో వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరడం తో ఈ చర్చకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.. జనసేన అధినేత పవన్ విజయవాడ మేయర్ అభ్యర్థిత్వంపై కూడా ఆయన పేరు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో మేయర్ స్థానం జనసేనకు కేటాయించి రాధా కు సీటు ఇస్తారా అన్న ఊహాగానాలు మొదలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాధా 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం పనిచేసి టీడీపీతో కలిసి ప్రయాణించినప్పటికీ, ఆయన అధికారికంగా ఆ పార్టీలో





చేరలేదు.అయినప్పటికీ వంగవీటి రాధా ను టీడీపీ నేతగానే భావిస్తూ వస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా మేయర్ అభ్యర్థిత్వంపై కథనాలు వెలువడుతుండడం ఇప్పుడు జనసేనలోకి ఆయన రావడం వెనుక రాజకీయ భవిష్యత్తు, స్థానిక ఎన్నికల్లో పాత్ర వంటి అంశాలపై చర్చ జరుగుతోంది.

రాధా చేరికను ముందుగానే జరిగిన ఒప్పందంగా వైసీపీ చెపుతుంటే జనసేన లోకి ఎప్పటినుంచో వెళ్లే ఆలోచన ఉందని ఇప్పటికి కుదిరిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇలా ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ హఠాత్తుగా పార్టీ మారిన గత సందర్భాలను పరిశీలిస్తే

2024 ఎన్నికల్లో అవనిగడ్డ ఒక స్పష్టమైన ఉదాహరణ.

మాజీ మంత్రి, మండలి బుద్ధప్రసాద్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. అయితే కూటమి సీట్ల పంపకంలో అవనిగడ్డ జనసేనకు కేటాయించబడటంతో ఆయన జనసేనలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

తన పార్టీలో పనిచేసిన నాయకుడికి టికెట్ ఇవ్వలేని పరిస్థితిలో, కూటమి సర్దుబాటుకు అనుగుణంగా ఆయన మరో పార్టీ నుంచి పోటీ చేసే పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ సర్దుబాటు పార్టీ అంతర్గతంగా అందరికీ ఆమోదయోగ్యంగా మారిందా? అనేది వేరే ప్రశ్న. బుద్ధప్రసాద్ జనసేనలో చేరినప్పుడు స్థానిక జనసేన నాయకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికి ఒక నాయకుడి చేరిక అగ్రనాయకత్వానికి వ్యూహాత్మక పరిష్కారంగా కనిపించిన తరుణంలో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలు తలొగ్గక తప్పలేదు.

అదేవిధంగా అనపర్తి నియోజకవర్గానిది కూడా ఇదే కథ.

కూటమి సర్దుబాటు లో భాగంగా ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అప్పటికే టీడీపీ టికెట్ ఆశించారు. బీజేపీ మరో అభ్యర్థిని ప్రకటించినప్పటికీ, స్థానిక రాజకీయ పరిస్థితులు, నల్లమిల్లి ప్రభావం తదితర అంశాల నేపథ్యంలో సర్దుబాట్లు జరిగి చివరకు నల్లమిల్లి బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేసి అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా శాసనశభ లోకి అడుగుపెట్టారు.

అప్పట్లో బీజేపీ రాష్ట్ర నాయకత్వ నిర్ణయంపై పార్టీ లో అసంతృప్తి వ్యక్తమైంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు టికెట్లు ఇవ్వడం వల్ల కార్యకర్తల మనోధైర్యం దెబ్బతింటుందనే అభిప్రాయాలు కూడా బలంగానే వెలువడ్డాయి.

అంటే, ఒక సీటును గెలుచుకోవడమే పార్టీ లక్ష్యమైతే స్థానికంగా బలమైన నాయకుడిని తీసుకోవడం సహజం గా కనిపించవచ్చుమో కానీ. కానీ ఒక పార్టీ దీర్ఘకాల ప్రయోజనాల విషయంలో, కార్యకర్తలు, స్థానిక నేతల మనోభావాల విషయంలో మాత్రం వేరే ఫలితాలను ఇస్తుందని చెప్తున్నారు రాజకీయ పండితులు.

ఇక భీమవరం నియోజకవర్గానిది వేరే వెర్షన్ అంజిబాబు గా పాపులర్ అయిన పులపర్తి రామాంజనేయులు, 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో టీడీపీ అభ్యర్థిగా పవన్ కల్యాణ్‌పై భీమవరంలోనే పోటీ చేశారు 2024 ఎన్నికలకు ముందు జనసేనలో చేరి, మళ్లీ అదే భీమవరం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు శాశ్వతంగా ఉండరనే మాటకు ఇది ఒక ఉదాహరణ. ముందు జరిగిన ఎన్నికల్లో వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేసిన నాయకులు, మరుసటి ఎన్నికల్లో ఒకే కూటమిలో భాగస్వాములవుతున్నారు. అంతేకాదు, దీన్ని అవకాశవాద రాజకీయంగా చూడాలా? లేక పొత్తు ధర్మంలో భాగంగా చూడాలా అనేది పరిస్థితులను బట్టి సమాధానం మారుతూనేవుంటుంది.

ఒక నియోజకవర్గంలో పార్టీకి ఉన్న నాయకత్వాన్ని, గెలుపు అవకాశాలను, కూటమి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవడం రాజకీయ వ్యూహంలో భాగమే కానీ ఇప్పటికే పార్టీ కోసం పనిచేసిన నాయకులకు అవకాశం ఇవ్వకుండా, చివరి నిమిషంలో హఠాత్తుగా పార్టీ లోకి వచ్చిన వ్యక్తికి టికెట్ కేటాయిస్తే, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను పార్టీ నాయకత్వం తప్పకుండా వివరించాల్సిన అవసరమైతే కచ్చితంగా ఉంటుంది. నిజానికి ఈ విధానం ఏ ఒక్క పార్టీకో సంబంధించినది కాదు. ఎన్నికల పొత్తుల్లో సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ బలాబలాలు పరస్పరం ముడిపడినప్పుడు అనేక పార్టీలూ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంటాయి.

2024 ఎన్నికలకు ముందు జనసేనలోకి ఇతర పార్టీల నుంచి వచ్చిన పలువురు నాయకులకు టికెట్లు దక్కాయి. ఆ సమయంలో జనసేన ప్రకటించిన 21 అసెంబ్లీ అభ్యర్థుల జాబితా లో ఎనిమిది మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులే కావడం గమనార్హం..!

దాదాపుగా జనసేన టీడీపీ మధ్య సర్దుబాటు పూర్తయిన తరుణం లో

మరికొన్ని మేల్ మెరుపులు తళుక్కు మనే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వాటిని కొత్తగానో.. గొప్పగానో చూడాల్సిన అవసరం లేదంటున్నారు.ఇక విజయవాడ మేయర్ స్థానం జనసేనకు కేటాయింపు పై స్పష్టత రాలేదనే చెప్పాలి..? ఒకవేళ కేటాయిస్తే రాధాకృష్ణ పోటీలో ఉంటారా? లేక ఆయనకు వేరే బాధ్యతలు అప్పగిస్తారా? అన్నది ఇంకా క్లారిటీ రావాల్సిన అంశం.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పొత్తులు, చేరికలు, టికెట్ల పంపకం చూస్తుంటే ఒక ఆసక్తికరమైన మార్పు కనిపిస్తోంది. గతంలో పార్టీ నాయకులను తయారు చేసుకొని, వారిని ప్రజల్లోకి పంపి, వారి ద్వారా సంస్థను బలోపేతం చేసుకోవాలనే ఆలోచనకు ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు కొన్ని సందర్భాల్లో స్థానికంగా గుర్తింపు ఉన్న నాయకుడిని ఎంచుకొని, ఆ తర్వాత ఆయనకు అనుకూలంగా పార్టీ టికెట్, పొత్తు సర్దుబాట్లు చేసుకునే ధోరణి కనిపిస్తోంది. బలమైన నాయకులను చేర్చుకోవడం పార్టీ విస్తరణకు ఉపయోగపడొచ్చేమో గాని అదే సమయంలో సొంత పార్టీ నేతలకు అవకాశాలు తగ్గితే సంస్థాగత సమస్యలు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.



# ప్రియుడి బెయిల్ కోసం డ్రగ్స్ సేల్స్

### రూ. 50 వేల ఆఫర్ కోసం దందాలోకి

### కాలేజీ విద్యార్థులే టార్గెట్ గా అమ్మకాలు

### నెట్‌వర్క్ లో తెలుగు రాష్ట్రాలు వ్యక్తులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నాగసౌమ్య ప్రియుడు మూడు నెలల క్రితం డ్రగ్స్ దందా కేసులో చిత్తూరులో అరెస్టయ్యాడు. అతడికి బెయిల్ ఇప్పించేందుకు అవసరమైన డబ్బు కోసం నాగసౌమ్య డ్రగ్స్ తరలించే పనికి అంగీకరించింది. ఈ క్రమంలో బషీర్ అనే వ్యక్తి ఆమెకు రూ.50 వేల ఆఫర్ చేశాడు. బెంగళూరు నుంచి విజయవాడకు డ్రగ్స్‌ను సురక్షితంగా తీసుకొస్తే రూ.50 వేలు ఇస్తానని బషీర్ చెప్పడంతో, సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతో నాగసౌమ్య ఈ పనికి అంగీకరించినట్లు విచారణలో వెల్లడించింది. బెంగళూరు నుంచి విజయవాడకు సుమారు 110 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను నాగసౌమ్య తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ వ్యవహారంపై ముందుగానే సమాచారం అందడంతో ప్రభుత్వ రైల్వే పోలీసులు, ఈగల్ బృందాలు అప్రమత్తమయ్యాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిఘా ఏర్పాటు చేసి, డ్రగ్స్ తరలిస్తున్న సమయంలో నాగసౌమ్యను అదుపులోకి తీసుకున్నారు.

**కాలేజీ విద్యార్థులే టార్గెట్?**

ఆమెను విచారించగా డ్రగ్స్ సరఫరా వెనుక బషీర్ పాత్ర ఉన్నట్లు తెలిసిందని, అనంతరం ఆధారాల ఆధారంగా అతడిని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసులో మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. బషీర్ వ్యవహారంపై విచారణలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కాలేజీలను లక్ష్యంగా చేసుకుని, అక్కడి విద్యార్థుల ద్వారా డ్రగ్స్ విక్రయాలు సాగిస్తున్నట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. బషీర్ కార్యకలాపాలపై గతంలోనూ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి పోలీసులకు సమాచారం అందింది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, ఇతర వ్యక్తుల ప్రమేయం, డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించిందనే అంశాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

**బషీర్ కాల్‌డేటాపై పోలీసుల నిఘా**

మరోవైపు బషీర్ అరెస్ట్‌తో ఈ డ్రగ్స్ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అతడి కాల్‌డేటా, కాంటాక్ట్ లిస్ట్, ఆర్థిక లావాదేవీలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ సరఫరాలో అతడితో సంబంధాలు కలిగిన వ్యక్తులు ఎవరనే అంశాన్ని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే అతడి ఆదాయ వనరులు, డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది, ఆ మొత్తాలు ఎక్కడికి బదిలీ అవుతున్నాయి అనే అంశాలపైనా విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించిన డబ్బుకు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలతో సంబంధాలున్నాయా అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానాలు ఇంకా నిర్ధారణ కాని అంశాలుగానే చూడాలి. నాగసౌమ్య అరెస్ట్, బషీర్ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై మరోసారి చర్చకు దారితీసింది. డబ్బు ఆశతో కొరియర్‌గా మారుతున్న వ్యక్తులు, యువతను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సరఫరాదారులు, వారి వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కీలకంగా మారింది. ప్రస్తుతం పోలీసులు సేకరిస్తున్న కాల్‌డేటా, ఆర్థిక లావాదేవీలు, ఇతర ఆధారాల ఆధారంగా ఈ వ్యవహారంలో మరిన్ని పేర్లు బయటపడతాయా? డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఎంత విస్తరించింది? అనే ప్రశ్నలకు దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టత రానుంది.

## ఐఏఎస్ అధికారి

# విక్రాంత్ మర్మత్‌పై వేటు

### బెంగళూరు పబ్ లో దాడి ఘటనపై సీరియస్

### కాడా పీడీ బాధ్యతల నుంచి బదిలీ

### జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

(అమరావతి - జయజయహే)



కర్ణాటక రాజధాని బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసులపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి విక్రాంత్ మర్మత్ పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విక్రాంత్ మర్మత్ కుప్పం కెడా పీడీ బాధ్యతల నుంచి బదిలీ చేస్తూ, సాధారణ పరిపాలనా శాఖకు సరెండర్ చేశారు. తక్షణమే జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ విక్రాంత్ మర్మత్‌ను ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ నిరంతర నిర్వహణ కోసం త్వరలోనే కొత్త ఇన్‌ఛార్జి నియామకానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

**అసలేం జరిగింది?**

ఇటీవల బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఐఏఎస్ అధికారి విక్రాంత్ మర్మత్, ఆయన మిత్రులు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులతో ఘర్షణకు దిగారని ఆరోపణలు వచ్చాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడం, ఐఏఎస్ అధికారిపై క్రిమినల్ కేసులు నమోదు కావడంతో ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయనను కుప్పం బాధ్యతల నుంచి తొలగిస్తూ విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

# ఎన్నికల వేళ మద్యం విక్రయాలపై నిఘా

### జిల్లా ఎన్నికల అధికారి

### ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే



జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలు, పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యాన్ని వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం నిల్వలు, విక్రయాలను గత ఏడాది ఇదే కాలంలో నమోదైన వివరాలతో పోల్చి పరిశీలించాలని సూచించారు. అక్రమ మద్యం తయారీ కేంద్రాలు, అక్రమ రవాణా, నిల్వలు, పంపిణీపై తనిఖీలు ముమ్మరం చేయాలని, అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల నిషేధిత కాలంలో, అలాగే ఓట్ల లెక్కింపు రోజున మద్యం విక్రయాలు, పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




# వాన్ పిక్ కేసులో కీలక పరిణామం

### ఐఎఎస్ అధికారి కేవీ బ్రహ్మానంద రెడ్డి చిక్కులు

### ఈడీ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)

గత ప్రభుత్వ హయాంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ శాఖా ప్రత్యేక కార్యదర్శిగా పనిచేసిన కేవీ బ్రహ్మానందరెడ్డి.. జగన్‌తో కుమ్మక్కై.. వాన్‌పిక్ గ్రూప్ ఆఫ్ కంపెనీకి ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నారని ఈడీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు బ్రహ్మానందరెడ్డిని విచారణ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈడీ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. మాజీ ఐఏఎస్‌ను విచారణ చేయడానికి ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ఆర్సీపీ అధినేత జగన్‌తో కలిసి కేవీ బ్రహ్మానందరెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ ఆరోపణలు చేస్తోంది. వాడరేవు నిజాంపట్నం ఓడరేవు పారిశ్రామిక కారిడార్ (వాన్‌పిక్) కంపెనీకి ప్రత్యేక ప్రయోజనాలు చేకూరేలా అప్పటి ప్రత్యేక కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి నిర్ణయాలు తీసుకుని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణలున్నాయి. ఈ కేసులో జగన్ ప్రధాన నిందితుడు కాగా.. కేవీ బ్రహ్మానందరెడ్డిని ఈడీ 18వ నిందితుడిగా చేర్చింది. కాగా.. ఈడీ విచారణలో కేసుకు సంబంధించి పలు కీలక అంశాలు వెలుగుచూసే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## భారీ ఐపీఓ.. మార్కెట్లలో ఒడుదొడుకులు!

**సి.హెచ్. ప్రతాప్**

**1. రూ.30 వేల కోట్ల జియో ఐపీఓకు రంగం సిద్ధం!**

భారత స్టాక్‌మార్కెట్ చరిత్రలో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు జియో ప్లాట్‌ఫామ్స్ సిద్ధమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఈ సంస్థ ఐపీఓ అక్టోబర్ 21న ప్రారంభం కానుంది. ఒక్కో షేరుకు రూ.1,065 నుంచి రూ.1,119 వరకు ధరల శ్రేణి నిర్ణయించారు. మొత్తం 27 కోట్ల షేర్ల ద్వారా గరిష్ఠంగా రూ.30,213 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. అక్టోబర్ 19న యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ప్రారంభమవుతుంది. సంస్థ విలువ సుమారు రూ.10.3 లక్షల కోట్లుగా అంచనా. టెలికాం, డిజిటల్ సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తరిస్తున్న జియో ఐపీఓపై దేశీయ, అంతర్జాతీయ మదుపర్లు ఆసక్తిగా దృష్టి సారించారు.

**2. బీహెచ్‌ఈఎల్ లాభాల్లో భారీ వృద్ధి!**

ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) సెప్టెంబర్ త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సంస్థ ఏకీకృత నికర లాభం గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.375 కోట్ల నుంచి రూ.821 కోట్లకు పెరిగింది. ఆదాయం 23.8 శాతం వృద్ధితో రూ.9,300 కోట్లకు చేరింది. విద్యుత్, పారిశ్రామిక విభాగాల్లో వ్యాపార కార్యకలాపాలు పెరగడం సంస్థ పనితీరుకు దోహదపడింది. మొత్తం ఆదాయం రూ.9,553 కోట్లుగా నమోదైంది. మెరుగైన ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేర్లపై మదుపర్ల ఆసక్తి పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి పరికరాల తయారీ, మౌలిక సదుపాయాల రంగాల్లో సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.




**3. నష్టాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు!**

దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 251.89 పాయింట్లు తగ్గి 72,781.89 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 99.25 పాయింట్ల నష్టంతో 22,622.70 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 106 డాలర్ల సమీపానికి చేరడం, విదేశీ మదుపర్ల అమ్మకాల ఒత్తిడి మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఆర్థిక సేవలు, ఆటోమొబైల్ రంగాల షేర్లు నష్టపోగా, సమాచార సాంకేతిక రంగ సూచీ 1.1 శాతం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించారు.

**4. డాలర్‌తో పోలిస్తే రూపాయికి స్వల్ప ఊరట!**

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బుధవారం వరుసగా మూడో రోజు బలపడింది. ట్రేడింగ్ సమయంలో డాలర్‌కు రూ.94.77 స్థాయిని తాకిన రూపాయి, చివరకు రూ.95.15 వద్ద ముగిసింది. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో ఊహాజనిత లావాదేవీలను నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న చర్యలు రూపాయికి మద్దతునిచ్చాయి. అయితే దిగుమతిదారుల నుంచి డాలర్లకు కొనసాగుతున్న డిమాండ్, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, పెరుగుతున్న ముడిచమురు ధరలు ఒత్తిడి కలిగిస్తున్నాయి. రూపాయి విలువ స్థిరత్వానికి అవసరమైన మరిన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు.

# నాసిరకం మౌలిక సదుపాయాలకు బాధ్యత ఎవరిది?

**(ప్రతాప్)**

**అభివృద్ధికి రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్లు అత్యంత అవసరం. ప్రజాధనంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మౌలిక సదుపాయాలు ప్రజలకు సౌకర్యాన్ని కల్పించాలి. ప్రయాణ సమయాన్ని తగ్గించాలి. రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. కానీ ప్రారంభించిన కొద్దిరోజులకే ట్రాఫిక్ సమస్యలు, నిర్మాణ లోపాలు బయటపడితే ఆ ప్రాజెక్టుల ప్రయోజనంపై సందేహాలు తలెత్తడం సహజం. ముఖ్యంగా లోపాలకు బాధ్యత వహించాల్సిన సంస్థ ఏదో స్పష్టంగా లేకపోవడం మన మౌలిక సదుపాయాల నిర్వహణలో పరిష్కరించాల్సిన ప్రధాన సమస్య.**



ఢిల్లీలో ఇటీవల ప్రారంభించిన బారాపుల్లా మూడోదశ ఫ్లైఓవర్ ఇందుకు తాజా ఉదాహరణ. ప్రారంభమైన రెండు రోజుల్లోనే సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి సరాయ్ కాలేఖాన్ వరకు ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టినట్లు వార్తలు వెల్లడించాయి. ట్రాఫిక్ పోలీసుల డ్రోన్ పరిశీలనలో రహదారులు కలిసే ప్రాంతాల్లో రూపకల్పన లోపాలు బయటపడ్డాయి. మూడు వరుసలున్న



రెండు రహదారుల నుంచి వచ్చే వాహనాలు మరో మూడు వరుసల రహదారిలోకి ప్రవేశించాల్సి రావడం, కొన్ని ప్రాంతాల్లో వాహన వరుసలు అకస్మాత్తుగా ముగియడం రద్దీకి కారణాలుగా గుర్తించారు.

ఇలాంటి సమస్యలు దేశంలోని ఇతర నగరాల్లోనూ కనిపించాయి. ముంబయిలో గోఖలే వంతెనను పక్కనున్న ఫ్లైఓవర్‌తో అనుసంధానించడంలో తలెత్తిన ఎత్తు వ్యత్యాసం చర్చనీయాంశమైంది. భోపాల్‌లోని ఐష్‌బాగ్ రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై దాదాపు లంబకోణంలో మలుపు ఏర్పాటు చేయడం నిర్మాణ ప్రణాళికపై ప్రశ్నలను లేవనెత్తింది. ఢిల్లీలో రూ.777 కోట్లతో నిర్మించిన ప్రగతి మైదాన్ సొరంగమార్గంలో నీరు చేరడం, పగుళ్లు ఏర్పడడం కూడా నాణ్యత పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని గుర్తుచేశాయి.

వాస్తవానికి ఆధునిక నగరాల్లో మౌలిక సదుపాయాల నిర్మాణం సంక్లిష్టమైన ప్రక్రియ. భూసేకరణ సమస్యలు, స్థలాభావం, భూగర్భ సేవలు, పెరుగుతున్న వాహనాల సంఖ్య, వివిధ ప్రభుత్వ విభాగాల అనుమతులు ప్రాజెక్టుల అమలును ప్రభావితం చేస్తాయి. అయితే ఈ పరిమితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర ప్రణాళిక రూపొందించడమే సమర్థమైన నిర్వహణకు నిదర్శనం.

ఒక ప్రాజెక్టులో ప్రజాపనుల శాఖ, మున్సిపల్ సంస్థ, రైల్వేలు, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు భాగస్వాములై ఉండవచ్చు. కానీ సమస్య తలెత్తినప్పుడు ఒక సంస్థ మరొక సంస్థపై బాధ్యత నెట్టివేస్తే ప్రజలకు పరిష్కారం లభించదు. అందువల్ల ప్రతి ప్రాజెక్టుకు రూపకల్పన నుంచి నిర్వహణ వరకు సమన్వయ బాధ్యత వహించే అధికార వ్యవస్థను స్పష్టంగా నిర్ణయించాలి.

ప్రాజెక్టు ప్రారంభానికి ముందే స్వతంత్ర సాంకేతిక నిపుణులతో భద్రత, నిర్మాణ నాణ్యత, ట్రాఫిక్ ప్రవాహంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. భవిష్యత్తులో పెరిగే వాహనాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల అభిప్రాయాలను సేకరించాలి. నిర్మాణ లోపాలను సరిదిద్దే బాధ్యతను ఒప్పందాల్లో స్పష్టంగా పొందుపరచాలి.

అలాగే ప్రాజెక్టుల వ్యయం, పురోగతి, నాణ్యత పరీక్షల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రారంభోత్సవం తర్వాత కూడా పనితీరును సమీక్షించాలి. లోపాలు తలెత్తితే వాటిని నిర్దిష్ట గడువులో సరిదిద్దే విధానం ఉండాలి. మంచి పనితీరును ప్రోత్సహిస్తూ, నిర్లక్ష్యం నిర్ధారణైతే తగిన జవాబుదారీతనం అమలు చేయాలి.

అభివృద్ధిని కేవలం నిర్మించిన వంతెనల సంఖ్యతోనో, వెచ్చించిన కోట్ల రూపాయలతోనో కొలవకూడదు. ప్రజలకు కలిగిన సౌకర్యం, ఆదా అయిన సమయం, పెరిగిన భద్రత, నిర్మాణాల మన్నికే నిజమైన ప్రమాణాలు.

ప్రారంభోత్సవంతో ప్రభుత్వ ప్రాజెక్టు పూర్తవుతుంది. కానీ ప్రజలకు దాని ప్రయోజనం అందినప్పుడే అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుంది. ప్రజాధనంతో చేపట్టే ప్రతి నిర్మాణానికి నాణ్యత పునాది కావాలి. జవాబుదారీతనం రక్షణగా నిలవాలి.

### శరన్నవరాత్రుల ప్రత్యేక శీర్షిక 6వ రోజు

# శ్రీ సరస్వతి దేవి అలంకరణ - మూల నక్షత్రము

## స్వరస్వతీ అలంకరణ ఎందుకు ప్రత్యేకం?

**అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం. ఆ రోజు అమ్మ తన నిజ స్వరూపమైన జ్ఞాన రూపాన్ని చూపిస్తుందని చెబుతారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే త్రిశక్తుల్లో సరస్వతి జ్ఞానానికి ప్రతీక. నరుడిని నరోత్తముడిగా, నారాయణ తత్వాన్ని ఇచ్చేది ఈ తల్లే.**

**అలంకరణ ఎలా ఉంటుంది?**

ఆభరణాలు: బంగారు వీణ (కచ్ఛపి వీణ), పగడాల హారం, స్వర్ణ హస్తాలు, వడ్డాణం, బంగారు పూల జడ.

**వస్త్రం:**

తెల్లని / తెలుగు రంగు పట్టు వస్త్రం, తెల్లని పూలతో పూజ చేయడం ఉత్తమము.

**రూపం:**

తెల్లని వస్త్రాలు, చేతిలో వీణ, పుస్తకం, అక్షమాల, హంస వాహనంపై కూర్చున్నట్టుగా దర్శనం.

ఈ రోజు ఏం చేయాలి

**అక్షరాభ్యాసం:**

బాసర, వర్గల్, విజయవాడ దుర్గగుడిలో లక్షల మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపిస్తారు.

అక్షరాభ్యాసం అయిన చిన్నారులకు కూడా సరస్వతి దేవి అలంకరణ రోజు మళ్లీ తిరిగి ప్రత్యేకంగా నూతన పలకతో సరస్వతీ పూజ చేయడం అతి విశేషమైన అంశము.




**బొమ్మల కొలువు:**

తెలుగు ఇళ్లలో ఈ రోజు నుండే బొమ్మల కొలువు పెట్టి పేరంటాలు చేస్తారు.

**పుస్తక పూజ:**

విద్యార్థులు తమ పుస్తకాలను అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజిస్తారు

**నైవేద్యం:**

దధ్యోజనం (పెరుగన్నం).
క్షీరము, క్షీరన్నము.

**శ్లోకం: -**

సరస్వతి నమస్తుభ్యం వరదే కామ-
రూపిణి । విద్యారంభం కరిష్యామి
సిద్ధిర్భవతు మే సదా...

ఈ రోజు దర్శనం చేసుకుంటే విద్యలో విజయం, వాక్శుద్ధి, జ్ఞానం లభిస్తుందని నమ్మకం.

**ప్రత్యేకత:**

అమ్మవారి ని సరస్వతీ రూపం లో దర్శిస్తే అఖండ విద్యాప్రాప్తి కలుగుతుంది. తప్పక అమ్మవారి ని దర్శించుకోవాలి.

**రచన**

**ఏ.బాల సౌజన్యకుమారి,**

**తెలుగు ఆచార్యులు,**

**నంది అవార్డు గ్రహీత, ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త.**





### డేటా సెంటర్ల కోసం

# జలాశయాల నీరా?

**వాటిని వినియోగించకూడదు**

**భారత జలపురుషుడు డాక్టర్ రాజేంద్ర సింగ్**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే**

విశాఖపట్నంలోని ముడసర్లొవ, గంభీరం గెడ్డ జలాశయాల నుంచి డేటా సెంటర్ల కోసం ఒక్క చుక్క నీటిని కూడా వినియోగించకూడదని ప్రముఖ పర్యావరణవేత్త, భారత జలపురుషుడు డాక్టర్ రాజేంద్ర సింగ్ స్పష్టం చేశారు. డేటా సెంటర్ నిర్మాణంతో కొండలు, పచ్చదనం, జలవనరులు, సింహాచలం దేవస్థాన పవిత్ర భూములకు నష్టం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఆయన, ప్రకృతి పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముడసర్లొవ జలాశయాన్ని ప్రస్తావిస్తూ, గతంలో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నీటి నిల్వలను మెరుగుపరిచేందుకు కృషి చేశామని గుర్తుచేశారు. జలాశయ పరివాహక ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలు పర్యావరణానికి ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొండలను తొలగించడం, చెట్లను నరికివేయడం వల్ల నేలకోత పెరిగి, మట్టి జలాశయాల్లో చేరి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విశాఖ నగర భవిష్యత్తు, ప్రజల నీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని జలవనరులను కాపాడాలని పిలుపునిచ్చారు. జల్ బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణతో కలిసి అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ఐ. కాశీ విశ్వనాథ రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. డేటా సెంటర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, పర్యావరణ చట్టాల ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు కూడా సమస్యను వివరించి తక్షణ జోక్యం కోరనున్నట్లు తెలిపారు. అభివృద్ధి జరగాలి.. కానీ ప్రకృతి నాశనం కాకూడదని, భవిష్యత్తు తరాల కోసం కొండలు, అడవులు, జలాశయాలను పరిరక్షించడం అందరి బాధ్యతని డాక్టర్ రాజేంద్ర సింగ్ పేర్కొన్నారు.

# గ్రేటర్ విశాఖ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

**- 1,990 పోలింగ్ కేంద్రాలు..**

**- 18.37 లక్షల మంది ఓటర్లు**

**- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే :**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరితో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.




జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల్లో 778 ప్రాంతాల్లో 1,990 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 18,37,901 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఎన్నికల విధుల్లో సుమారు 8,000 మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు. వచ్చే ఆదివారం నాటికి పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, విద్యుత్, సీసీ కెమెరాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియో చిత్రీకరణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి విధులు, బాధ్యతలపై శిక్షణ పూర్తి చేయాలని, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, పెట్టెల పంపిణీ, తరలింపు, భద్రపరిచే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సున్నిత, అత్యంత సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత కల్పించాలని ఆదేశించారు.

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తు కోసం 6,548 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నగరంలో నిరంతర నిఘా కొనసాగిస్తామని, సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను అడ్డుకోవాలని, అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌ను ఐదు రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మేయర్ అభ్యర్థికి రూ.40 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.15 లక్షల ఎన్నికల వ్యయ పరిమితి ఉందని వివరించారు. ఎన్నికల నిర్వహణకు 201 రూట్లు, 239 రూట్ అధికారులు, 67 సెక్టోరల్ అధికారులు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 20 నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కలాం స్ఫూర్తి ఎప్పటికీ సజీవం

**- విశ్రాంత జేసీ పి.రజనీకాంతరావు**

**- గాంధీ మందిరంలో జయంతి వేడుకలు**

**శ్రీకాకుళం. (జయ జయహే)**

సమాజం పట్ల బాధ్యత, దేశం పట్ల ప్రేమ కలిగిన భారతరత్న అబ్దుల్‌కలాం ప్రపంచానికి అందించిన స్ఫూర్తి ఎప్పటికీ సజీవమని విశ్రాంత జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంతరావు అన్నారు. ప్రపంచాన్ని ప్రభావితం చేసిన కలాం వ్యక్తిత్వం ఎంతో అరుదైనదని ఆయన కొనియాడారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. విగ్రహ సమర్పకులు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ బరాటం శ్రీరామమూర్తి, విద్యావేత్త బరాటం లక్ష్మణరావు, రిటైర్డ్ డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు పాలిశెట్టి మధుబాబు, గాంధీ మందిరం కన్వీనర్ జామి భీమశంకరరావు, హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు హారికాప్రసాద్, లయన్స్ క్లబ్ ఎన్విరాన్మెంట్ జిల్లా చైర్మన్ పొన్నాడ.రవికుమార్‌లతో కలిసి రజనీకాంతరావు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ జీవితం నుంచి అసాధారణ స్థాయికి ఎదిగిన కలాం ప్రస్థానం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల రాష్ట్రపతిగా పేరుగాంచడంతో పాటు శాస్త్రవేత్తగా భారతదేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దడంలో కలాం ఎంతో కృషి చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువతకు కలాం జీవితం, ఆయన చూపిన బాట నిత్యం జ్వలిస్తూనే ఉంటుందని వారు చెప్పారు. ముఖ్య అతిథి రజనీకాంతరావుతో పాటు విగ్రహ సమర్పకులు బరాటం శ్రీరామమూర్తి, బరాటం లక్ష్మణరావు, జామి తరుణ్ కుటుంబ సభ్యులను గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు శిల్లా సతీష్, చౌదరి రాధాకృష్ణ, పందిరి అప్పారావు, నక్క శంకరరావు, జి.నాగేశ్వరరావు, గురువు మురళీ, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



## 52వ వార్డులో వైసీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

**అభయ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు.. ప్రచారానికి శ్రీకారం**

**కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన కురసాల కన్నబాబు, కె.కె. రాజు**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే**

: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 52వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న నక్కవానిపాలెంలోని శ్రీ అభయ దుర్గాదేవి ఆలయం వద్ద నుంచి ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా కురసాల కన్నబాబు, కె.కె. రాజు మాట్లాడుతూ.. విశాఖపట్నం నగర అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పునాది పడిందని పేర్కొన్నారు. ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనూ నగర అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత చంద్రబాబు నాయుడు ప్రభుత్వ విధానాల కారణంగా విశాఖ అభివృద్ధి వెనుకబడిందని వారు విమర్శించారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో వైసీపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 52వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డులో పార్టీ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టేందుకు నాయకులు సన్నద్ధమయ్యారు.

# నేటి నుంచి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

**18 వరకు, రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రక్రియ**

**జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికలు-2026కు సంబంధించి నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో, అధికారులు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు, ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 19న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. అక్టోబర్ 21, మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ పక్రియ సాగుతుందని, 30న ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని గురువారం ఓ ప్రకటన ద్వారా వివరించారు. జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం 10 జోన్లలో వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారులను, నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఈ క్రమంలో తెలిపారు.




**జోన్‌లు, వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు**

జోన్‌లు, వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. భీమిలి జోన్‌లో 1 నుంచి 5 వార్డులకు భీమిలి జోనల్ కార్యాలయం, మధురవాడ జోన్‌లో 6 నుంచి 12 వార్డులకు మధురవాడ జోనల్ కార్యాలయం, ఈస్ట్ జోన్‌లో 12 నుంచి 29 వార్డులకు అసిల్మెట్టలోని ఈస్ట్ జోన్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని చెప్పారు. సౌత్ జోన్‌లో 30 నుంచి 45 వార్డులకు సూర్యాబాగ్‌లో వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని జోనల్ కార్యాలయం, నార్త్ జోన్‌లో 46 నుంచి 65 వార్డులకు మాధవధార వుడా లేఅవుట్‌లోని ఆర్‌టీఏ కార్యాలయం రోడ్డులో ఉన్న నార్త్ జోన్ కార్యాలయం, వెస్ట్ జోన్‌లో 66 నుంచి 82 వార్డులకు ఎన్.ఏ.డి. కొత్త రోడ్డు జంక్షన్‌లోని గౌరి నగర్‌లో ఉన్న వెస్ట్ జోన్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు.

గాజువాక జోన్‌లో 83 నుంచి 101 వార్డులకు శ్రీనగర్‌లోని 100 ఫీట్ రోడ్డులో ఉన్న గాజువాక జోనల్ కార్యాలయం, అగనంపూడి జోన్‌లో 102 నుంచి 106 వార్డులకు పెద్దమడకలోని రాజీవ్ గాంధీ కళ్యాణ మండపం, శివాలయం రోడ్డులో ఉన్న అగనంపూడి జోనల్ కార్యాలయం, అనకాపల్లి జోన్‌లో 107 నుంచి 112 వార్డులకు నాలుగు రోడ్ల కూడలిలోని అనకాపల్లి జోనల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని పేర్కొన్నారు. పెందుర్తి జోన్‌లో 113 నుంచి 120 వార్డులకు నాయుడుతోట జంక్షన్ సమీపంలోని వేపగుంట మెయిన్ రోడ్డులో ఉన్న పెందుర్తి జోనల్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన వార్డుకు సంబంధించిన నామినేషన్ కేం

ద్రాన్ని గుర్తించి, నిర్దేశిత ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు.




## చేతుల పరిశుభ్రతతో వ్యాధులకు దూరం

**ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షులు డాక్టర్ మురళి మోహన్**

**గీతం అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే**

చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల డయేరియా, రక్తవిరేచనాలు, వాంతులు, టైఫాయిడ్, పోలియో వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా. ఎం.వి.వి. మురళీ మోహన్ తెలిపారు. పెదజలరిపేటలోని గీతం అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవాన్ని నిర్వహించి, స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. మురళీ మోహన్ మాట్లాడుతూ చేతుల ద్వారా సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి అనేక వ్యాధులకు కారణమవుతాయని, భోజనానికి ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ వైస్ ప్రిన్సిపాల్ డా. జితేంద్ర మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డా. ఓ. సత్యనారాయణ చేతుల పరిశుభ్రత నిర్లక్ష్యం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. డా. యశోద చేతులు కడుక్కోవాల్సిన సరైన పద్ధతులను ప్రదర్శించి, పాల్గొన్నవారితో అభ్యాసం చేయించారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్నవారికి చేతుల శుభ్రత కోసం హ్యాండ్ శానిటైజర్లు, అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ సభ్యులు, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు, సిబ్బంది, అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, ఇంటర్న్‌లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ సాహితీ మహోత్సవానికి ఆచార్యురాలు బాల సౌజన్యకు ఆహ్వానం

**కవితా పఠనానికి అవకాశం**

**అనకాపల్లి, అక్టోబర్ 15, జయ జయహే**




తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న 8వ ప్రపంచ సాహితీ మహోత్సవానికి అనకాపల్లికి చెందిన ప్రముఖ విద్యావేత్త, నంది అవార్డు గ్రహీత, ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త శ్రీమతి ఏ. బాల సౌజన్య కుమారికి ఆహ్వానం అందింది. ఈ మహోత్సవంలో కవితా పఠనం చేసేందుకు ఆమెకు అవకాశం లభించింది. నవంబర్ 1న రాజమహేంద్రవరంలోని గౌతమి సదన్ ఆడిటోరియంలో ఈ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ తెలుగు కవుల సమ్మేళనం, సాహిత్య సదస్సులు, పుస్తకావిష్కరణలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద కళారూపాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ప్రముఖ కవి, రచయిత, కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్ అంతర్జాతీయ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న శ్రీ కళావేదిక సారథ్యంలో ఈ మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి దేశవిదేశాలకు చెందిన ప్రముఖ కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరుకానున్నారు.



## ఆపరేషన్ త్రిశూల్ లో భాగంగా నల్లగొండలో అవగాహన సదస్సు

**కొయ్యూరు, (జయ జయహే న్యూస్) అక్టోబర్ 16**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నల్లగొండ గ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ వ్యూహంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు మరియు పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.రహదారి భద్రత, మహిళల భద్రత, గంజాయి అక్రమ రవాణా, వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాల నివారణ, రాబోయే ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అలాంటి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని హెచ్చరించారు.రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ బి. శ్రీనివాసరావు కోరారు.

# జీవీఎంసీ మేయర్ బరిలో వరుదు కళ్యాణి

**వైసీపీ అధికారిక ప్రకటన..**

**విశాఖ రాజకీయాల్లో వేడెక్కిన సమీకరణాలు!**

**కూటమికి సవాల్ విసిరేందుకు వైసీపీ వ్యూహాత్మక అడుగు..**

**మేయర్ పీఠంపై ఆసక్తికర చర్చ**

**విశాఖపట్నం, అక్టోబర్ 15, జయ జయహే :**



గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ ఎన్నికల బరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి నిలవనున్నారు. ఈ మేరకు పార్టీ అధికారికంగా ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు సమాచారం. రానున్న నగర పాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం విశాఖ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే మేయర్ అభ్యర్థుల ఎంపికపై ప్రధాన రాజకీయ పార్టీల్లో కసరత్తు జరుగుతుండగా, వరుదు కళ్యాణి పేరును ఖరారు చేయడం ఎన్నికల పోరుపై ఆసక్తిని మరింత పెంచింది.

**మహిళా ఓటర్లపై ప్రత్యేక దృష్టి!**

జీవీఎంసీ మేయర్ పదవిని సాధారణ మహిళా కేటగిరీకి కేటాయించడంతో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగవంతమైంది. ఈ నేపథ్యంలో మహిళా నాయకురాలిగా, ఎమ్మెల్సీగా రాజకీయ అనుభవం ఉన్న వరుదు కళ్యాణిని బరిలోకి దింపడం ద్వారా మహిళా ఓటర్లతో పాటు నగరంలోని వివిధ వర్గాల మద్దతును కూడగట్టేందుకు వైసీపీ ప్రయత్నించవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం**

విశాఖ నగరంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ రాజకీయ బలాన్ని నిరూపించుకోవడం వైసీపీకి కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మేయర్ అభ్యర్థిగా వరుదు కళ్యాణి ఎంపిక పార్టీ శ్రేణుల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా వార్డులవారీగా అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల సమన్వయం, ప్రచార వ్యూహాలు, ఓటర్లను ఆకర్షించే కార్యక్రమాలపై పార్టీ నాయకత్వం దృష్టి సారించాల్సి ఉంటుంది.

**కూటమి అభ్యర్థితో హోరాహోరీ పోరు?**

మరోవైపు, అధికార కూటమిలోనూ మేయర్ అభ్యర్థి ఎంపికపై చర్చలు కొనసాగుతున్నాయి. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది. కూటమి తరఫున ఎవరిని బరిలోకి దింపుతారు? వైసీపీ అభ్యర్థికి దీటైన పోటీ ఇచ్చేందుకు ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తారు? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**అభ్యర్థి ఎంపికే కాదు.. గెలుపు లక్ష్యంగా వ్యూహం!**

మేయర్ అభ్యర్థిని ప్రకటించడం ఎన్నికల వ్యూహంలో తొలి అడుగు మాత్రమే. వార్డులవారీగా బలమైన అభ్యర్థులను నిలబెట్టడం, స్థానిక సమస్యలపై ప్రజల్లోకి వెళ్లడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ఓటర్ల విశ్వాసాన్ని పొందడం వంటి అంశాలు కీలకం కానున్నాయి.

ముఖ్యంగా విశాఖ నగరంలో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, ట్రాఫిక్, ఆస్తిపన్ను, పట్టణ మౌలిక సదుపాయాలు వంటి అంశాలు ఎన్నికల ప్రచారంలో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. ఈ సమస్యలపై పార్టీలు ప్రజలకు ఇచ్చే హామీలు, గత పాలనలో సాధించిన అభివృద్ధిని ఎలా వివరిస్తాయన్నది ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపవచ్చు.

**వరుదు కళ్యాణికి సవాళ్లు.. అవకాశాలు!**

ఎమ్మెల్సీగా ఉన్న రాజకీయ అనుభవం వరుదు కళ్యాణికి అనుకూల అంశంగా మారవచ్చు. అయితే, నగరవ్యాప్తంగా ప్రజల మద్దతును కూడగట్టడం, పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, కూటమి అభ్యర్థి నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకోవడం ఆమెకు కీలక సవాళ్లుగా నిలవనున్నాయి.

మరోవైపు, వైసీపీకి ఈ ఎన్నికలు నగరంలో తన రాజకీయ పునాదిని తిరిగి బలోపేతం చేసుకునే అవకాశంగా నిలుస్తున్నాయి. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ద్వారా నగర రాజకీయాల్లో తమ ప్రాధాన్యతను చాటుకోవాలని పార్టీ భావించే అవకాశం ఉంది.

**విశాఖ రాజకీయాల్లో కీలక మలుపు!**

మొత్తంగా, జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా వరుదు కళ్యాణి పేరును వైసీపీ ఖరారు చేయడం ఎన్నికల రాజకీయాల్లో కీలక పరిణామం. అయితే, అభ్యర్థి ప్రకటనతోనే గెలుపు ఖాయమని చెప్పలేం. వార్డులవారీగా పార్టీ బలం, అభ్యర్థుల ఎంపిక, కూటమి వ్యూహం, స్థానిక సమస్యలు, ఓటర్ల తీర్పు అంతిమ ఫలితాన్ని నిర్ణయించనున్నాయి.

వరుదు కళ్యాణి నాయకత్వంలో వైసీపీ ఎలాంటి ఎన్నికల వ్యూహాన్ని అనుసరిస్తుంది? కూటమి ఎవరిని రంగంలోకి దించుతుంది? జీవీఎంసీ మేయర్ పీఠాన్ని ఏ పార్టీ దక్కించుకుంటుంది? అన్నది రానున్న రోజుల్లో విశాఖ రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.





## దేశ రక్షణకు ప్రార్థనే బలమైన ఆయుధం

**- వైసీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు డాక్టర్ జాన్ వెస్లీ**

**- రాజమండ్రిలో 'ఆంధ్రప్రదేశ్ యేసయ్యకే' 48 గంటల ప్రార్థన కూటమి ప్రారంభం**

**రాజమండ్రి, అక్టోబర్ 15, జయ జయహే**

తెలుగు రాష్ట్రస్థాయి ప్రార్థన పండుగల్లో భాగంగా రాజమండ్రిలోని దహించు ఆత్మ మినిస్ట్రీస్ ఆలయంలో 'ఆంధ్రప్రదేశ్ యేసయ్యకే' నినాదంతో 48 గంటల ప్రార్థన కూటమిని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాజమండ్రి జిల్లా అధ్యక్షుడు విజయసారథి అధ్యక్షత వహించారు. దేశంలోని క్రైస్తవులందరూ సురక్షితంగా ఉండాలని, వారిపై ఎలాంటి దాడులు జరగకుండా క్రైస్తవ్యం అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో ఈ ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మన ప్రయత్నాలతో సాధించలేని కార్యాలను దేవుని ప్రార్థన ద్వారా సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ, ప్రార్థన క్రైస్తవులకు దేవుడిచ్చిన శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రార్థన అనేది దేవునికి, మనిషికి మధ్య జరిగే సజీవ సంభాషణ అని వివరించారు. మోకాళ్లపై వంగి చేసే ప్రార్థనలు దేశానికి రక్షణగా నిలుస్తాయని, దేశం కోసం నిరంతరం చేసే ప్రార్థనలు దేశానికి శ్రేయస్సును తీసుకొస్తాయని పేర్కొన్నారు. పవిత్ర బైబిల్‌లో యోనా, హన్నా, దావీదు చేసిన విజ్ఞాపన ప్రార్థనలు విశేష ఫలితాలను అందించాయని గుర్తుచేశారు. యేసు ప్రభువు తన శిష్యులకు నేర్పిన పరలోక ప్రార్థన అన్ని ప్రార్థనల్లోనూ విశిష్టమైనదని వివరించారు. ప్రార్థనలో దేవునికి స్తుతులు చెల్లించడం, చేసిన తప్పులకు పశ్చాత్తాపం వ్యక్తం చేయడం, దేవుడు చేసిన మేళ్లకు కృతజ్ఞతలు తెలపడం, తమ అవసరాలను విన్నపాల రూపంలో తెలియజేయడం అనే నాలుగు అంశాలు ముఖ్యమని తెలిపారు. ప్రతి క్రైస్తవుడు ప్రార్థన చేసే ముందు తన ప్రవర్తనను ఆత్మపరిశీలన చేసుకోవాలని, సన్మార్గంలో నడుస్తూ పొరుగువారిని తనవలే ప్రేమించినప్పుడే ప్రార్థనలకు తగిన ఫలితాలు లభిస్తాయని జాన్ వెస్లీ సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పాస్టర్ అరుల్ అరసు మాట్లాడుతూ, క్రైస్తవ జీవితంలో నిరంతర ప్రార్థనకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దేశ సరిహద్దులను సైనికులు కాపాడుతున్నట్లే, దేశం కోసం ప్రార్థించే ప్రతి క్రైస్తవుడు దేశ రక్షణలో తన వంతు పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ్యం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగాలనే లక్ష్యంతో ఈ 48 గంటల ప్రార్థన కూటమిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సురేంద్రబాబు, రెవరెండ్ లాజరస్, క్రైస్తవ నాయకులు జేమ్స్ వీకే కుంపట్ల, విలియం కేరి తదితరులు ప్రసంగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రార్థన యోధులు, క్రైస్తవ నాయకులు, క్రైస్తవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం తగదు

**ఏఐటీయూసీ నాయకుల డిమాండ్**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14, జయ జయహే**

శ్రీకాళహస్తి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు జాప్యం చేస్తున్నారని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన వారందరికీ సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. ఈ మేరకు గురువారం శ్రీకాళహస్తిలోని ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఏఐటీయూసీ జిల్లా, ఏరియా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కత్తి రవి, శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి తొండు మల్లికార్జున్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమయానికి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. అభ్యర్థులందరినీ సమానంగా పరిగణించి, ఎలాంటి జాప్యం లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు జారీ చేయాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మురళి, పాండు, గణేష్, రమేష్, మనోహర్, చందు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చర్యలు

**జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, అక్టోబర్ 15 జయ జయహే**



: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికలు--2026 నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, సంబంధిత రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల ప్రాధికార సంస్థ కేతన్ గార్గ్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బ్యానర్లు మరియు ఫ్లెక్సీలు ప్రైవేటు బిల్డింగులు మరియు ఖాళీ స్థలములనందు సదరు యజమాని అనుమతితో ప్రదర్శించుకోవచ్చును. అట్టి అనుమతి పత్రము జీ.వీ.ఎం.సీ ప్రధాన కార్యాలయం / జోనల్ కార్యాలయములయందు సమర్పించి తగు అనుమతి పొందవలెను. అట్టి అనుమతి లేని ఫ్లెక్సీలు / బ్యానర్లు ప్రదర్శించు అభ్యర్థులపై ఎన్నికల నిబంధనావళి ననుసరించి చర్యలు తీసుకొనబడును. సభలు, పెద్ద శబ్దములతో కూడిన మైకులు ఉపయోగించుట మరియు ఊరేగింపులకు సంబంధించి పోలీసు వారి అనుమతి పొందవలెను. పైన తెలిపిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గమనించుటకు పోలీసు అధికారులు మరియు ఇతర జి.వి.యం.సి అధికారులతో కూడిన 10 తనిఖీ బృందములు నియమించుట జరిగినది. పై బృందములు నగరమంతా సంచరించుచూ, ఏదేని నియమ ఉల్లంఘన గమనించిన ఎడల ఎన్నికల నియమావళి అనుసరించి చర్యలకు ప్రతిపాదించుదరు. పైన తెలిపిన బృందములు కాకుండా 20 చెక్ పోస్టులు పోలీసు వారు మరియు జీ.వీ.ఎం.సీ సిబ్బందితో, జి.వీ.ఎం.సీ పరిధి నందు ఏర్పాటు చేయడం జరిగినది. సదరు చెక్ పోస్టులయందు వాహనములను, వ్యక్తులను తనిఖీ చేయుదురు. ఎవరైనా నిమిత్తము లేని ధనము మరియు మద్యంతో పట్టుబడిన ఎడల ఎలక్షన్ నియమావళిని అనుసరించి చర్యలు తీసుకొనబడును. పోటీ చేయు అభ్యర్థులు, అభ్యర్థుల తరపున ఎవరేని మద్యం, డబ్బు, ఏదైనా ఇతర వస్తువులతో ఓటర్లను ప్రలోభ పెట్టుట చేసినయెడల చర్యలు తీసుకొనబడును. పైన తెలిపిన ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ఏదైనా చర్య జరిగిన ఎడల ఎవరైనా వ్యక్తులు సమాచారం తెలుపుటకు జివిఎంసి కంట్రోల్ రూమ్ నెం. 1800 4250 0009 / అలాగే సంబంధిత రిటర్నింగ్ అధికారులు, ఎలక్షన్ పరిశీలకులను సంప్రదించవచ్చునని కమిషనరు తెలిపారు.



## శ్రీకాళహస్తిలో శ్రావణ్ ఈవీ బైక్ షోరూమ్ ప్రారంభం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని చెన్నై రోడ్డులో ధర్మరాజుల స్వామి ఆలయానికి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రావణ్ ఈవీ బైక్' షోరూమ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎలక్ట్రిక్ బైక్‌లను ఆమె పరిశీలించారు. అనంతరం షోరూమ్‌లో విక్రయానికి అందుబాటులోకి వచ్చిన తొలి ఈవీ బైక్‌ను బొజ్జల రిషిత రెడ్డి స్వయంగా కొనుగోలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన పొదుపునకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఈవీ వాహనాల వినియోగం ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ప్రజలకు ఆధునిక రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్న షోరూమ్ నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు, షోరూమ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రాణనష్టం.. ఎస్సై హరిప్రసాద్**

**బుచ్చినాయుడు కండ్రిగ (జయ జయహే)**



బుచ్చినాయుడు కండ్రిగ తడ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కుక్కలవారి కుంభాకం గ్రామానికి చెందిన కారణి వెంకటరమణ (38) వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో చేరేందుకు గురువారం తెల్లవారుజామున 4.30 నుంచి 5.20 గంటల మధ్య స్కూటర్‌పై నాయుడుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని అరిగిలి కండ్రిగ సమీపంలో గుర్తుతెలియని వాహనం అతని స్కూటర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆయనే జీవనాధారం కావడంతో ఆయన మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై హరిప్రసాద్ సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో తలకు తీవ్రమైన గాయాలయ్యే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలతో పాటు తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు.



## స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

**ఎమ్మెల్యే రాజు**

**బుచ్చయ్యపేట, జయ జయహే**

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కోరారు. గురువారం అమరపురిలో నియోజకవర్గ టీడీపీ సమావేశం నిర్వహించారు. 4 మండలాలు టీడీపీ శ్రేణులు హాజరయ్యారు. 4 ఎంపీపీలు, 4జడ్పీటీసీలతో పాటు 119 పంచాయతీలను కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు. రిజర్వేషన్లు ఎంపికలో పాలకుల ప్రమేయం ఉండదు అన్నారు. నిబంధనలకు లోబడి అధికారులే నిర్ణయిస్తారు అన్నారు. ఏకాభిప్రాయంతో బలమైన అభ్యర్థులనే బరిలోకి దించుతామన్నారు. పోటీ చేయడానికి అవకాశం రానివారికి భవిష్యత్తులో నామినేటెడ్ అవకాశాలు కల్పిస్తామన్నారు. స్థానికంగా బిజెపి జనసేన నాయకులను కలుపుకొని ఎన్నికలకు వెళ్లాలి అన్నారు. స్థానిక ఎన్నికలలో ప్రతిఓటు కీలకం అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలి అన్నారు ఎన్నికల పరిశీలకులు వానపల్లి గాయత్రి, డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గూనూరు మల్లు నాయుడు, రాజాన కొండ నాయుడు, నాలుగు మండలాల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశానికి నమూనా పరీక్ష

**సందురు.మురళి**

**శ్రీకాకుళం (జయ జయహే )**



నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం, ప్రవేశ నమూనా పరీక్ష--2026 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సందురు.మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 25 ఆదివారం, శ్రీకాకుళం స్థానిక శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాలలో నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు, నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి స్థాయి అవగాహన కల్పించేలా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి 20 మంది విద్యార్థులకు బహుమతులు, మొదటి ముగ్గురు విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు అందిస్తామని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షలో పాల్గొనదలచిన విద్యార్థులు రూ.100 నమోదు రుసుముతో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాల కోసం 8688164900 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. నవోదయ ప్రవేశానికి సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# పూడి గ్రామంలో వర్షపు నీటితో ప్రజల అవస్థలు

### కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి వీధిలో నిలిచిన నీరు

### డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**తొట్టంబేడు, అక్టోబర్ 15, జయ జయహే**

తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామంలో కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి ఎదురుగా ఉన్న వీధిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ నీరు బయటకు వెళ్లే మార్గం లేక సిమెంట్ రోడ్డుపైనే నిలిచిపోతోందని వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే వీధి ప్రారంభంలో ఉన్న రెండు ఇళ్ల యజమానులు తమ ఇళ్ల ముందు ఎర్రమట్టి, గ్రావెల్ పోసి రోడ్డుకంటే ఎత్తుగా చదును చేయడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వర్షం పడిన ప్రతిసారీ రోడ్డుపై నీరు నిలిచి ప్రజలకు రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయని వాపోతున్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వీధిలో నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉ ండటంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా, కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడికి వచ్చే భక్తులు సైతం నీరు నిలిచిన వీధి గుండా వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోకుండా అడ్డంకులను తొలగించి, వర్షపు నీరు సాఫీగా బయటకు వెళ్లేందుకు తగిన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పూడి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

**అనకాపల్లి (జయ జయహే)**

భారతరత్న అవార్డు గ్రహీత, మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా, భారతదేశ 11,వ రాష్ట్రపతిగా సేవలందించిన నిస్వార్ధ సేవకులుఅబ్దుల్ కలాం 95 వ జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జయంతి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీ.వీ.ఎన్. కాలేజ్ ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో నిస్వార్ధంగా సేవచేసి ఉన్నత శిఖరాల చేరిన మహనీయులు కలాం ప్రతి ఒక్క విద్యార్థి అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన భారతదేశానికి చేసిన సేవలను గుర్తించుకోవాలని కలాం తెలిపారు అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ కలాం మరియు స్వాతంత్ర సమరయోధులు జయంతి వర్ధంతి తో పాటు, క్రీడా కార్యక్రమము నిర్వహించడం అనకాపల్లి జిల్లాలో అబ్దుల్ కలాం పేరు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఆళ్ళ ప్రవీణ్ కుమార్ నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు దాడి వాసు, సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరి, నటభూషణ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చిశేతా లక్ష్మణరావు,యాదగిరి రామచంద్రరావు, విన్నకోట నీలేష్ గుప్తా,మరియు డి.వి.ఎన్ కాలేజ్ ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అశ్రునయనాల నడుమ అమ్మనమ్మ అంత్యక్రియలు

**- తల్లికి అంతిమ సంస్కారాలు జరిపిన మాజీ డిప్యూటీ సీఎం బూడి**

**- కడసారి చూపు కోసం తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు**

**- సంతాపం తెలిపిన ప్రముఖ నాయకులు, అధికారులు**

**దేవరాపల్లి, అక్టోబర్ 15, జయ జయహే**

మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్సీపీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బూడి ముత్యాలనాయుడు మాతృమూర్తిబూడి అమ్మనమ్మ అంత్యక్రియలను తారువ స్మశానవాటికలో కుటుంబసభ్యుల అశ్రునయనాల నడుమ గురువారం నిర్వహించారు.అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో మాతృమూర్తి పార్థివ దేహంవద్ద మాజీ డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు సహా కుటుంబసభ్యులంతా కన్నీటి పర్యాంతమయ్యారు. సాంప్రదాయ బద్ధంగాముత్యాలనాయుడు తన తల్లికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.అమ్మనమ్మను కడసారి చూసేందుకు విశాఖపట్నం ఉమ్మడి జిల్లాతోపాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వైఎస్సార్సీపీనాయుకులు తరలివచ్చారు. మాడుగుల నియోజకవర్గం వ్యాప్తంగాపార్టీలకు అతీతంగా ప్రజలు, పలు రాజకీయ పార్టీ నాయుకులు, అధికార్లు, అభిమానులు వేలాది మంది తరలివచ్చి కన్నీటి వీడ్కోలుపలికారు. అమ్మనమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీంతో తారువ పరిసరాలన్నీ జనసమూహంతోకిక్కిరిసాయి. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలుపెట్ల ఉమా శంకర్ గణేష్, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అదీప్ రాజ్, ఉమ్మడి విశాఖ జెడ్పీమాజీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడుబొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్సీపీ మాడుగుల నియోజకవర్గ పైలాశ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యన్నారాయణ,ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులనాయుడు, మాజీ కొప్పల వెలమకార్పోరేషన్ చైర్మన్ నెక్కళ్ల నాయుడుబాబు, గండి రవికుమార్, ప్రముఖన్యాయవాది దేవిడ్ తదితర నాయుకులు, అధికార్లు అమ్మనమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, ముత్యాలనాయుడును పరామర్శించారు. అలాగే పలువురు మాజీమంత్రులు, రాష్ట్ర పార్టీ నాయుకులు, ఉన్నాతాధికార్లు ఫోన్ ద్వారాఅమ్మనమ్మ మృతికి సంతాపం వెలిబుచ్చారు.

# శ్రీ కోటసత్తెమ్మ ఆలయంలో ఉచిత సరస్వతీ పూజ.....

**మూల నక్షత్రం సందర్భంగా అక్టోబర్ 17న ప్రత్యేక పూజా కార్యక్రమం**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీ శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సామూహిక సరస్వతీ పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.విద్యకు అధిదేవత అయిన సరస్వతీ అమ్మవారి అనుగ్రహం విద్యార్థులపై ఉండాలని, వారు విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ సామూహిక పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మూల నక్షత్రం సందర్భంగా నిర్వహించే ఈ పూజలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని దేవస్థానం నిర్వాహకులు కోరుతున్నారు.విద్యార్థులలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, విద్యారంగంలో వారు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి దేవస్థానానికి విచ్చేసి సరస్వతీ పూజలో పాల్గొనాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు దేవులపల్లి రవి శంకర్ విద్యార్థినీ, విద్యార్థులందరూ ఈ ఉచిత సామూహిక సరస్వతీ పూజలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.






# స్థానిక ఎన్నికలపై టీడీపీ కీలక సమావేశం

**మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు**

**శ్రీకాళహస్తి , అక్టోబర్, 14, జయ జయహే**

శ్రీకాళహస్తి అన్నమయ్య జిల్లాలో జరగనున్న మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గురువారం మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు.ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మధుసూదన్ నాయుడు, తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్ యాదవ్, రాయలసీమ జోనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మానిటరీ బోర్డు చైర్మన్ దామర్లచెర్ల సత్య, అన్నమయ్య జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు సుగువాసి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పరిశీలకుడు మాసారపు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు

# కూటమి సీట్ల పంపకం కుదిరింది

## రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీలకు సీట్ల కేటాయింపు

**జయ జయహే ప్రతినిధి :**

**రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి సీట్ల పంపకం కుదిరింది. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీలకు సీట్ల కేటాయింపు సాఫీగా సాగిపోయింది.17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సీట్ల పంపకం పూర్తి. 17 కార్పొరేషన్లలో టీడీపీకి 11, జనసేనకు 4, బీజేపీకి 2, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టీడీపీకి 78, జనసేనకు 21, బీజేపీకి 7, మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీకి 89, జనసేనకు 25, బీజేపీకి 9 స్థానాలు కేటాయింపు జరిగింది.**



**జాబితా ఇదే..**

పట్టణ స్థానిక సంస్థల వారీగా కూటమి పార్టీలకు కేటాయింపులు

గ్రేటర్ విశాఖపట్నం టీడీపీ కి, విజయవాడ జనసేనకు కేటాయింపు

కాకినాడ, ఏలూరు, శ్రీకాకుళం కార్పొరేషన్లు జనసేనకు కేటాయింపు

రాజమహేంద్రవరం, అనంతపురం కార్పొరేషన్లు బీజేపీకి కేటాయింపు

విజయనగరం, మచిలీపట్నం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు కార్పొరేషన్లు టీడీపీకి

ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లు టీడీపీకి కేటాయింపు

శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస టీడీపీకి కేటాయింపు

విజయనగరం జిల్లాలో రాజాం జనసేనకు, బొబ్బిలి టీడీపీకి, నెల్లిమర్ల బీజేపీకి కేటాయింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ, సాలూరు జనసేనకు.. పార్వతీపురం టీడీపీకి కేటాయింపు

అనకాపల్లి జిల్లాలో యలమంచిలి బీజేపీకి, నర్సీపట్నం టీడీపీకి కేటాయింపు

కాకినాడ జిల్లాలో తుని, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట జనసేనకు కేటాయింపు

కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, పెద్దాపురం టీడీపీకి కేటాయింపు

కోనసీమ జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం జనసేనకు కేటాయింపు

కోనసీమ జిల్లాలో రామచంద్రపురం టీడీపీకి కేటాయింపు

తూర్పు గోదావరి జిల్లాలో మండపేట, కొవ్వూరు టీడీపీకి.. నిడదవోలు జనసేనకు కేటాయింపు

పశ్చిమ గోదావరి జిల్లాలో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం జనసేనకు కేటాయింపు

పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు, ఆకివీడు, తణుకు టీడీపీకి కేటాయింపు

ఏలూరు జిల్లాలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు టీడీపీకి కేటాయింపు

ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు జనసేనకు.. కొండపల్లి, నందిగామ, జగ్గయ్యపేట టీడీపీకి కేటాయింపు

కృష్ణా జిల్లాలో పెడన జనసేనకు.. గుడివాడ, తాడిగడప, ఉయ్యూరు టీడీపీకి కేటాయింపు

గుంటూరు జిల్లాలో తెనాలి జనసేనకు.. పొన్నూరు టీడీపీకి కేటాయింపు

బాపట్ల జిల్లాలో బాపట్ల బీజేపీకి.. రేపల్లె, చీరాల టీడీపీకి కేటాయింపు

పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట జనసేనకు.. నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్ల, మాచర్ల టీడీపీకి కేటాయింపు

ప్రకాశం జిల్లాలో దర్శి జనసేనకు.. అద్దంకి, చీమకుర్తి, కందుకూరు టీడీపీకి కేటాయింపు

మార్కాపురం జిల్లాలో గిద్దలూరు బీజేపీకి.. మార్కాపురం, పొదిలి, కనిగిరి టీడీపీకి కేటాయింపు

నెల్లూరు జిల్లాలో కావలి బీజేపీకి.. అల్లూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, గూడూరు టీడీపీకి కేటాయింపు

తిరుపతి జిల్లాలో నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి టీడీపీకి కేటాయింపు

చిత్తూరు జిల్లాలో నగరి, పలమనేరు, కుప్పం టీడీపీకి.. పుత్తూరు జనసేనకు కేటాయింపు

వైఎస్సార్ కడప జిల్లాలో ఎర్రగుంట్ల బీజేపీకి.. బద్వేలు, రాజంపేట, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు టీడీపీకి కేటాయింపు

అన్నమయ్య జిల్లాలో రాయచోటి, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు టీడీపీకి కేటాయింపు

నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాల, బేతంచెర్ల, డోన్ టీడీపీకి కేటాయింపు

కర్నూలు జిల్లాలో గూడూరు బీజేపీకి.. ఎమ్మిగనూరు, ఆదోని టీడీపీకి కేటాయింపు

అనంతపురం జిల్లాలో రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గం టీడీపీకి కేటాయింపు

శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర, పుట్టపర్తి జనసేనకు.. హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కదిరి టీడీపీకి కేటాయింపు



For a pure tomorrow.. జయహే

# తల్లీబిడ్డల హత్య.. ఛిద్రమైన కుటుంబం!

సి.హెచ్. ప్రతాప్

**కుటుంబ వివాదాలపై మాట్లాడేందుకు ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన దంపతులు.. అంతకు కొన్ని గంటల ముందే ఆ ఇంట్లో ఘోరం జరిగింది. భార్య, నాలుగేళ్ల కుమారుడు హత్యకు గురికాగా, భర్త గాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు. కేరళలోని త్రిస్సూర్ జిల్లా వలప్పాడ్ బీచ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పరిష్కారం కోసం చర్చించాల్సిన సమస్యల మధ్య రెండు జీవితాలు అర్ధంతరంగా ముగిశాయి.**



మృతులను విస్మయ (24), ఆమె నాలుగేళ్ల కుమారుడిగా గుర్తించారు. విస్మయ భర్త విజేష్ వీరిద్దరినీ హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఘటన అనంతరం గాయాలతో కనిపించిన అతడిని త్రిస్సూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక వార్తా కథనం వెల్లడించింది. తల్లీకుమారులు నాట్టిక ప్రాంతానికి చెందినవారని సమాచారం. విస్మయ నివాసంలోనే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక వివరాలు వెల్లడిస్తున్నాయి.

వలప్పాడ్ పోలీసులను ఉటంకిస్తూ వచ్చిన కథనం ప్రకారం, దంపతుల మధ్య తరచూ కుటుంబ వివాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యలకు సంబంధించి గురువారం ఉదయం పది గంటలకు ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని పోలీసులు సూచించారు. అయితే, ఆ సమావేశానికి ముందే తల్లీకుమారుడు హత్యకు గురయ్యారు. దంపతుల మధ్య సమస్యలు పోలీసుల దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం కేసులో కీలక అంశంగా మారింది.




హత్యలకు ముందు ఇంట్లో ఏం జరిగింది? దాడికి దారితీసిన తక్షణ కారణమేమిటి? విజేష్‌కు గాయాలు ఎలా అయ్యాయి? ఈ ప్రశ్నలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు. అతడు ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఒక కథనం పేర్కొనగా, గాయాలకు దారితీసిన పరిస్థితులు నిర్ధారించాల్సి ఉందని స్థానిక కథనం తెలిపింది. ఈ అంశంపై పోలీసుల తదుపరి ప్రకటనతో స్పష్టత రావాల్సి ఉంది. ఘటన సమయంపై ప్రాథమిక కథనాల్లో స్వల్ప వ్యత్యాసం ఉన్నప్పటికీ, గురువారం తెల్లవారుజామున జరిగినట్లు సమాచారం స్పష్టం చేస్తోంది. హత్యకు ఉపయోగించిన ఆయుధం, దాడి జరిగిన క్రమం, మరణాలకు సంబంధించిన వైద్య నిర్ధారణలు ఇంకా వెల్లడికాలేదు. విజేష్ అరెస్టుపైనా పరిశీలించిన కథనాల్లో స్పష్టమైన సమాచారం లేదు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం దర్యాప్తు ప్రారంభ దశలోనే ఉంది.

కుటుంబ కలహాల నేపథ్యం ఉన్నప్పటికీ, హత్యలకు కచ్చితమైన కారణాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. గత వివాదాలకు, తాజా ఘటనకు మధ్య సంబంధం ఏమిటన్నది విచారణలో తేలాల్సి ఉంది. నిందితుడి పాత్ర, ఘటనకు దారితీసిన పరిస్థితులపై మరింత సమాచారం రావాల్సి ఉంది. ఉదయం జరగాల్సిన సమావేశానికి ముందే తల్లీబిడ్డల ప్రాణాలు పోవడం ఈ ఘటనలో అత్యంత విషాదకరమైన అంశంగా మిగిలింది.

మహిళలు, చిన్నారులపై హింసను అరికట్టాల్సిన అవసరాన్ని ఇటువంటి ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. రక్షణ కల్పించాల్సిన కుటుంబంలోనే ప్రాణాలకు ముప్పు ఏర్పడటం అత్యంత ఆందోళనకరం. బెదిరింపులు, దాడులను సాధారణ కుటుంబ గొడవలుగా తీసిపారేయకూడదు. బాధితులకు సకాలంలో రక్షణ, న్యాయసహాయం, అవసరమైన కౌన్సెలింగ్ అందాలి. చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమాద సంకేతాలను గుర్తించిన బంధువులు, పరిచయస్తులు బాధితులకు అండగా నిలవాలి. హింస జరిగిన తర్వాత న్యాయం కోరడంతోపాటు, జరగకముందే ప్రాణాలను కాపాడటం సమాజమంతటి బాధ్యత.

## వైసీపీ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్, నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థుల జాబితా

(తాడేపల్లి - జయజయహే)

**రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్ మేయర్, మున్సిపల్, నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థులను వైసీపీ ప్రకటించింది. జాబితా ఇదే..**

**కార్పొరేషన్ల లిస్ట్**

విశాఖపట్నం - వరుదు కళ్యాణి
ఏలూరు - గంటా మోహన్ రావు
మచిలీపట్నం - లంకా జ్యోతి
కడప - దీప్తి రెడ్డి
కర్నూలు - ఎం. సుశీల
నెల్లూరు - ఆనం విజయ్ కుమార్ రెడ్డి
ఒంగోలు - కుప్పం ప్రసాద్
విజయనగరం - కోలగట్ల శ్రావణి..

మున్సిపాలిటీలు జాబితా



ఇచ్ఛాపురం - పిలక రాజ్యలక్ష్మి
పలాస - శ్రీపద్మ
నర్సీపట్నం - చింతకాయల అనిత..
యలమంచిలి - బుద్దపు తులసి
తుని - రామతులసి
కొవ్వూరు - మన్నే పద్మ
రామచంద్రాపురం - చింతపల్లి నాగేశ్వరరావు
కొండపల్లి - నల్లమోతు తేజస్వి
తెనాలి - మద్దాలి శేషాచలం
చీరాల - ఇస్తర్ల షేర్లీ
బద్వేలు - రాచపూడి వెంకట సాయికృష్ణ.
ప్రొద్దుటూరు - పొర్రెడ్డి నరసింహారెడ్డి
పులివెందుల - వైఎస్ ప్రమీలమ్మ
మదనపల్లి - జింకా చలపతి

నగర పంచాయతీలకు వీరే.

ఏలేశ్వరం - బాదిరెడ్డి ఆశాలత
ఉయ్యూరు - పైడిముక్కల దివ్య.
గురజాల - పోలు వీరారెడ్డి
కనిగిరి - పులి శాంతిరెడ్డి
బుచ్చిరెడ్డిపాలెం - షేక్ షకీలా బేగం.
కమలాపురం - మర్జుల కవిత



## డార్క్ చాక్లెట్ తినటం వల్ల ప్రయోజనాలు

డార్క్ చాక్లెట్ అంటే దాదాపు అందరికీ ఇష్టమే. ఈ చాక్లెట్ కోకో బీన్స్‌తో తయారు చేస్తారు. సాధారణ చాక్లెట్‌తో పోలిస్తే, డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు పోషకాహార నిపుణులు. డార్క్ చాక్లెట్‌లో ఐరన్, కాపర్, ఫ్లేవనాయిడ్స్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. చలికాలంలో డార్క్ చాక్లెట్ తినడం ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. అంతేకాదు.. గ్రీన్ టీ కంటే డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.. మంట, నొప్పిని తగ్గించడంలో డార్క్ చాక్లెట్ తీసుకోవడం ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఎంత యాంటీ ఆక్సిడెంట్లు తీసుకుంటే అన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. యాంటీఆక్సిడెంట్లను తీసుకోవడం ఒత్తిడిని తగ్గిస్తుంది. డార్క్ చాక్లెట్‌లో థియోబ్రోమిన్ అనే రసాయనం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. డార్క్ చాక్లెట్ శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ వార్మింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. చల్లని వాతావరణంలో డార్క్ చాక్లెట్ తినటం వల్ల మీ శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. డార్క్ చాక్లెట్ ఆనందకరమైన రుచి మానసిక స్థితిని పెంచుతుంది. చల్లటి రోజులలో హాయిగా ఉంటుంది. చలికాలంలో జలుబు, దగ్గు సమస్య పెరుగుతుంది. దాన్ని తగ్గించుకోవడానికి డార్క్ చాక్లెట్ తినండి. డార్క్ చాక్లెట్‌లో థియోబ్రోమిన్ ఉంటుంది. ఈ మూలకం సహాయంతో, శ్వాసకోశ వ్యవస్థకు సంబంధించిన సమస్యలను తొలగించడంలో ఇది సహాయపడుతుంది. ఈ మూలకం సహాయంతో ఇది కాలానుగుణ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. కీళ్ల నొప్పులను తగ్గించడానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్న ఆహారాలు మేలు చేస్తాయి. చలికాలంలో డార్క్ చాక్లెట్ తినడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల కూడా కిరణాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. డార్క్ చాక్లెట్ తినడం వల్ల వృద్ధాప్య ప్రభావాలను కూడా తగ్గించుకోవచ్చు.

## జుట్టు పెరగడానికి బెస్ట్ ఆప్షన్

# క్యారెట్ హెయిర్ మాస్క్





**క్యారెట్ తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. క్యారట్‌లో పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ ఏ, బి,సితో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. క్యారెట్ ఆరోగ్యానికే కాదు జుట్టు సంరక్షణకు ఎంతో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం మీరు చేయాల్సిందల్లా క్యారెట్‌తో కొన్ని పదార్థాలను కలిపి హెయిర్ మాస్క్ తయారు చేసుకుని వాడటమే. ఈ విధంగా క్యారెట్ హెయిర్ మాస్క్ వాడటం వల్ల ఏవైనా హేర్ ప్రాబ్లమ్స్ ఉన్నా కూడా తొలగిపోతాయి. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా పెరుగుతుంది. ఇన్ని బెనిఫిట్స్ ఉన్న క్యారెట్ హెయిర్ మాస్క్‌లు ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.**

**క్యారెట్, అవకాడో మాస్క్:**

క్యారెట్స్, అవకాడోలను సమంగా తీసుకుని వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వీటిని మిక్సీలో వేసి మెత్తని పేస్టులాగా చేసుకోవాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని ఒక చిన్న బౌల్ లోకి తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్ల తేనెను కలుపుకోవాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని స్కాల్ప్ నుంచి జుట్టు కుదుళ్ల వరకు అప్లై చేసి.. స్మూత్‌గా మసాజ్ చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాల పాటు అలాగే ఉంచిన తర్వాత మైల్డ్ షాంపుతో తలస్నానం చేయాలి. పొడి జుట్టు ఉన్న వారు ఈ మాస్క్ వాడితే జుట్టు మృదువుగా తయారవడంతో పాటు ఒత్తుగా పెరుగుతుంది.

**క్యారెట్, ఆలివ్ ఆయిల్ మాస్క్:**

ఈ మాస్క్ జుట్టు పెరుగుదలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకోసం ముందుగా ఒక మీడియం సైజు ఉన్న క్యారెట్‌ను తీసుకుని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వాటిని మిక్సీ జార్‌లో వేసి అందులో రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, నిమ్మరసం వేసి మెత్తని పేస్ట్‌లాగా చేసుకోవాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని జుట్టుకు అప్లై చేసి అది ఆరే అంత వరకూ ఉంచుకోవాలి.



ఆ తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. 2017 జర్నల్ అఫ్ డెర్మటాలజికల్ సైన్స్‌లో ప్రచురితమైన ఒక నివేదిక ప్రకారం క్యారెట్‌లో ఉండే విటమిన్స్ స్కాల్ప్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చుండ్రును తగ్గిస్తాయి. ఇందుకు సంబంధించిన పరిశోధన దక్షిణ కొరియాలోని సియోల్ యూనివర్సిటీలో జరిగింది. ఇందులో పాల్గొన్న డెర్మటాలజిస్టులు క్యారెట్ సంబంధిత హెయిర్ మాస్క్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయని వెల్లడించారు.

**క్యారెట్,ఎగ్ మాస్క్:**

ఈ హెయిర్ మాస్క్ కూడా జుట్టు రాలడాన్ని తగ్గించి వెంట్రుకలు బలంగా, ఒత్తుగా పెరగడానికి ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మాస్క్ కోసం ఒక క్యారెట్ ను తీసుకుని దానిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై మిక్సీ జార్ తీసుకొని అందులో గుడ్డు పగులగొట్టి వేసుకోవాలి. దానిలోనే క్యారెట్ ముక్కలు , రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి మిక్సీ పట్టుకోవాలి. ఆపై మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట తర్వాత వాష్ చేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

**క్యారెట్, కొబ్బరి పాల మాస్క్:**

ఈ మాస్క్ కోసం ముందుగా ఒక క్యారెట్ తీసుకుని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వాటిని మిక్సీలో వేసి జ్యూస్ పట్టుకొని దాని నుంచి రసాన్ని ఒక బౌల్‌లో ఫిల్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత దానిలో పావు కప్పు కొబ్బరిపాలను కూడా కలుపుకోవాలి. అనంతరం కాటన్ బాల్ సహాయంతో ఈ మిశ్రమాన్ని జుట్టు మొత్తానికి అప్లై చేయాలి. అరగంట పాటు అలాగే ఉంచి ఆపై షాంపుతో తలస్నానం చేయాలి. ఇది జుట్టు డ్యామేజ్‌ను తగ్గించి జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడుతుంది. అంతే కాకుండా జుట్లు బాగా పెరగడానికి ఉపయోగపడుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com